RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 16.10.2026 | సంపుటి :13 సంచిక : 87 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






# 100 దేశాల్లో ఎల్‌నినో సమస్య

## తాగునీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నాం
## ప్రజల దైనందిన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం

- యాసంగిలో వరి సాగు వద్దు
- ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి
- కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి
- ఈ విషయంలో ప్రభుత్వానికి విపక్షాలు సహకరించాలి
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):ఎల్‌నినో పరిస్థితులకు అంతా సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిం చారు. రాబోయే రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరించారు.ఎల్‌నినో విపత్తు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను వణికిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని హెచ్చరించారు. అక్టోబ ర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదని, మార్కెట్‌లో విద్యు త్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కేం ద్రం నుంచి ఎలాంటి సహాయం పొందాలనే అంశంపై చర్చించామని, గతేడాది ఈ సమయానికి 400 టీఎంసీలకు పైగా అందుబాటులో ఉందని సీఎం రేవం త్ రెడ్డి తెలి పారు. ఈ ఏడాది అన్ని రిజర్వాయర్లలో కలిపి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నా యని అన్నారు. ఎప్పుడు కరవు వచ్చినా ఈ దేశాన్ని ఆదుకున్నది రైతులు మాత్ర మే అని కొనియాడారు. అందుబాటులో ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలని, నీటి కొరతను దృష్టిలో మిగతా 2లో..

> గతేడాది ఈ సమయానికి రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో కలిపి 400 టీఎంసీలకుపైగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ నీళ్లనే పొదుపుగా వాడుకోవాలి. వచ్చే ఎనిమిది నెలలు అత్యంత కీలకం. మళ్లీ వర్షాలు వచ్చేవరకు అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. రైతులు పెద్దమనసు చేసుకుని.. ఒక వరి సీజన్‌ను వాయిదా వేసుకోవాలి. యాసంగిలో వరి పంట వేయొద్దు. రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. సగటుపై అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగింది. అక్టోబరులో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదు. మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రానికి అదనపు విద్యుత్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాం. విద్యుత్‌పై ఇచ్చే సబ్సిడీలను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి. కేంద్ర-రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలి
>
> - సీఎం రేవంత్ రెడ్డి

సీఎం నేతృత్వంలో నవంబరు మొదటి వారంలో

## ఢిల్లీకి అఖిలపక్ష బృందం

2లో..

# జ్ఞానేశ్‌ను ఎందుకు కాపాడుతున్నారు?

## అమిత్ షా, మోదీ సమాధానం చెప్పాలి: అభిజీత్ దీప్కే

- నిరసనలు తెలియజేస్తున్న యువతను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్తున్నారు
- విద్యార్థులకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నాయకులను నిర్బంధించారు
- నేడు కన్నాట్ ప్లేస్ లోని సెంట్రల్ పార్కులో జాతీయ జెండాను ఎగురవేస్తామని వెల్లడి



న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వ తీరుపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పదునైన విమర్శలు గుప్పించారు. సీఈసీ రాజీనా మాకు సంబంధించి 15 రోజులుగా దిల్లీలో నిరసనలు తెలియజేస్తున్న యువతను పోలీసులు బలవంతంగా ఈ డ్చుకెళ్తున్నారని మండిపడ్డారు. అంతేకాదు విద్యార్థులకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నాయకులను నిర్బంధించా రని ఆరోపించారు. గురువారం దిల్లీలో జరిగిన మీడి యా సమావేశంలో దీప్కే మాట్లాడారు. "దిల్లీలో విద్యార్థి సంఘాలు, యువత వీధుల్లోకి రాగానే పోలీసులు వారిని ఈడ్చుకెళ్లారు. ఈ నిరసనల్లో విద్యార్థులకు మద్దతు తెలి పిన మాజీ ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకురా లు, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్ వంటివారిని సైతం నిర్బంధించారు. ఇదంతా ఎవరి కోసం జ్ఞానేశ్ కుమార్ కోసమేనా? నరేంద్ర మోదీకి జ్ఞానేశ్ కుమార్ అంత ముఖ్యమైన వ్యక్తి ఎందుకు అ య్యారు? మోదీ ఎన్నికల్లో గెలవడానికి సీఈ సీ సహాయ పడుతున్నారని మనం ఎందుకు మిగతా 2లో..



### హిందువులు ముస్లిం మతంలోకి మారితే

# బీసీ రిజర్వేషన్ వర్తించదు

## మతమార్పిడి రిజర్వేషన్లపై సుప్రీం కీలక తీర్పు

న్యూఢిల్లీ(జనంసాక్షి):మతమార్పిడి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హిందూమతం నుంచి ఇతర మతాల్లోకి మారినవారు.. కేవలం మతమార్పిడి ఆధారంగా వెనకబడిన తరగతుల కోటాను క్లెయిమ్ చేసుకోలేరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మతం మారినంత మాత్రానా.. ఆ వ్యక్తి సామాజిక వెనకబాటుతనాన్నీ బదిలీ చేయలేమని పేర్కొంది. ఇస్లాంలోకి మారిన వారికి బీసీ రిజర్వేషన్ అర్హత లేదంటూ గతంలో మద్రాస్ మిగతా 2లో..

### సింగరేణిని ప్రైవేటీకరణ

# చేయబోం.. చేయబోనివ్వం

## మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్(జనంసాక్షి): సింగరేణి సంస్థను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఆక్షేపించారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సింగరేణిని కాపాడింది.. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడారు. మిగతా 2లో..





# తప్పు మీది.. నెపం అధికారులపైనా..?

## విద్యుత్ సమస్యలను అధికారులపై నెట్టడం సరికాదు: హరీశ్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): తప్పు చేసి అధికారులపై నెపం నెట్టడం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు పరిపాటిగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. విద్యుత్ సమస్యలను అధికారులపై నెట్టడం సరికాదని, విద్యుత్ సంక్షోభానికి పాలకుల చేతగానితనమే కారణమని ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్టు పెట్టారు."బొగ్గు నిల్వలు కూడా పెట్టుకోకుం డా విద్యుత్ సంక్షోభానికి, విద్యుత్ రంగాన్ని గాలికి వదిలేసి కరెంట్ కోతలకు కారణమయ్యారు. నిషే ధిత భూముల జాబితాలో మిగతా 2లో..

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సీఈ సస్పెన్షన్

## విద్యుత్ ఉత్పత్తిలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడని సురేశ్ నాయక్‌పై వేటు
## ఇన్‌ఛార్జులుగా ఐదుగురు ఐఏఎస్‌లను నియమించిన ప్రభుత్వం

నల్గొండ(జనంసాక్షి): యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నిర్లక్ష్యంగా వ్యవహరించారని సీఈని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిలో జరుగుతున్న అంతరాయంపై ఉన్నతాధికా రులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే దామర చర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విద్యుత్ ఉత్పత్తిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చర్యలు తీసుకున్నారు. మరోవైపు పర్యవేక్షణ కోసం ఐఏఎస్ అధికారులను ఇన్?ఛార్జ్?లుగా ప్రభుత్వం నియమించింది. మరోవైపు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించేందుకు థర్మల్ కేంద్రానికి ప్రభుత్వం ఏఐఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించింది. హరికిషన్, వెంకటేశ్ దొత్రే, రాహు ల్‌రాజ్, హనుమంత్ కొండిబ, శివకుమార్ నా యుడు ని స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులి చ్చింది. వీరు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షిం చనున్నారు. విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మిగతా 2లో..



# రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కామ్ ఆపాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్(జనంసాక్షి): రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు కుంభకోణం ఆపాలని బీఆ ర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. "విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో భారీ స్కామ్‌కు కుట్ర జరుగుతోంది. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే సీఎం చీకటి ఒప్పందం చేసుకు న్నారు. కృత్రిమ బొగ్గు కొరత, కరెంటు సంక్షోభం సృష్టించి.. ఆ కంపెనీని రంగంలోకి దించారు. భోత్రా లాజిస్టిక్స్‌తో ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలి. మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఇటువంటి వ్యవహారాలను అడ్డుకోవాల్సింది పోయి సహకరిస్తున్నారు. కాంగ్రెస్, భాజపా కలిసి చేస్తున్న కుట్రలను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్

## మరో 3 రోజుల్లో మార్గదర్శకాలు విడుదల

2లో..

# పెట్టుబడులతో రండి

## పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది



- సింగిల్ విండో ద్వారా అనుమతులు
- భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం
- పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటాను
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
- సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్‌లో పారిశ్రామిక వేత్తలకుఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుం ది. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం. హైదరా బాద్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, అనుకూ లమైన గమ్యస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రా మికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని ఉప ముఖ్యమం త్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాం బర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్ 2026లో ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభు త్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సిం గిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పా రిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాం తిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన మిగతా 2లో..

### అమెరికాలో ఆలయంపై

# దాడికి కుట్ర

- చివరి నిమిషంలో రైఫిల్ జామ్ అవడంతో ఆగిన నరమేధం
- స్నేహితుడికి ఫోన్‌చేసి చెప్పడంతో విషయం వెలుగులోకి..
- ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత్
- భారతీయుల భద్రతపై మరిన్ని చర్యలు తీసుకోవాలి



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో ఇల్లినోయిలో హిందూ ఆలయంపై కాల్పుల కుట్ర కేసుకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వ చ్చాయి. ఈ కేసులో 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. భారతీయులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపే ఉద్దేశంతో అతడు ఆలయానికి వెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తిం చారు. అయితే, రైఫిల్ జామ్ అవడంతో అతడి కుట్ర విఫలమై నట్లు పేర్కొన్నారు.ఇల్లినోయి లోని పాలటైన్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ స్థానిక ఫాస్ట్‌ఫుడ్ రెస్టారంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. తీవ్రవాద భావజాలానికి ఆకర్షితుడైన అతడు.. భారతీయులను లక్ష్యంగా చేసుకుని భీకర దాడి చేసేందుకు కుట్ర పన్నినట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. మిగతా 2లో..

నిరసనల వేదికగా జంతర్‌మంతర్ తొలగింపు..

# కేంద్రానికి 'సుప్రీం' నోటీసులు



### ప్రభుత్వం ఇచ్చే వివరణను బట్టి తమ నిర్ణయం ఉంటుందన్న ధర్మాసనం

న్యూఢిల్లీ(జనంసాక్షి): జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖ లైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. మిగతా 2లో..

# భారత్-అమెరికా తొలి దశ ట్రేడ్ డీల్ ఖరారు

## పీయుష్ గోయల్



2లో..



# 140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేశారు

## ఆసియాడ్ విజేతలకు ప్రధాని మోదీ అభినందన

# రాత్రివేళల్లో నిఘా ముమ్మరం చేయాలి

## డీజీపీ సీవీ ఆనంద్

- శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం




**మల్కాజిగిరి అక్టోబర్ 15 (జనం సాక్షి) :** ప్రజల భద్రతే ధ్యేయంగా రాత్రి వేళల్లో పోలీసు నిఘాను మరింత ముమ్మరం చేయాలని, బీట్ పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్ఠం చేయాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. నేరెడ్ మెట్ లోని మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్‌ను సందర్శించి శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ సుమతితో పాటు డీసీపీలు, అదనపు డీఎస్పీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరు మెరుగుపడాలన్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో తగినంత సిబ్బందితో నిరంతరం పెట్రోలింగ్ కొనసాగాలని స్పష్టం చేశారు. నేరాల దర్యాప్తు, నియంత్రణలో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. స్టేషన్ సిఐ లు, ఏసీపీలు క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ పోర్టల్‌ను పక్కాగా వినియోగిస్తూ రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, కేసుల దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నమోదైన 17 సంచలన కేసులను విజయవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల కలకలం రేపిన బాలిక కిడ్నాప్, హత్య కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితులను పట్టుకోవడం పట్ల పోలీసుల పనితీరును ప్రశంసించారు. అలాగే దర్యాప్తుతో పలు కీలక కేసుల్లో నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా న్యాయస్థానాల్లో బలమైన ఆధారాలు సమర్పించిన అధికారులను కొనియాడారు. సమర్థవంతమైన దర్యాప్తు, పర్యవేక్షణే బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరుస్తాయని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విధుల్లో వృత్తిపరమైన ప్రమాణాలు, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయి అధికారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకునీ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# రాష్ట్రంలో ఏసీబీ హల్‌చల్

- పలుచోట్ల సోదాలు
- లంచగొండి అధికారుల పట్టివేత

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ కీసర/ మేడ్చల్ జిల్లా ప్రతినిధి/ హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** రాష్ట్రంలో గురువారం ఏసీబీ అధికారులు హల్‌చల్ చేశారు. రాష్ట్రంలో పలుచోట్ల సోదాలు నిర్వహించారు. లంచం డిమాండ్ చేస్తున్న పలువురు అధికారులను పట్టుకున్నారు. వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. భూ సంబంధిత పనికి లంచం తీసుకుంటుండగా తహసీల్దార్ అబూబాకర్, కార్యాలయ ప్రైవేట్ ఉద్యోగి భూభారతి ఆపరేటర్ అనిల్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేందర్ రెడ్డి వెల్లడించారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలానికి చెందిన నూకలమర్రి గ్రామానికి చెందిన ఓ బాధితుడు తన పేరిట భూమిని మ్యుటేషన్ చేయించుకునేందుకు వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించినట్లు తెలిపారు. అయినప్పటికీ తన పని పూర్తికాకపోవడంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారులు ప్రణాళిక ప్రకారం నిఘా ఏర్పాటు చేయగా బాధితుడి నుంచి భూభారతి ఆపరేటర్ అనిల్ ద్వారా రూ 8,000 లంచం తీసుకుంటున్న సమయంలో తహసీల్దార్ అబూబాకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు అయన తెలిపారు. అనంతరం కార్యాలయంలో సోదాలు నిర్వహించి, ఈ వ్యవహారానికి సంబంధించి ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

### రూ.2.50 లక్షల లంచం తీసుకుంటూ డీటీ పట్టివేత

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రూ. 2.50 లక్షల లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూమి మ్యుటేషన్, సర్వే పనుల కోసం రూ. 5 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడ్డ కీసర డిప్యూటీ తహసీల్దార్


పట్టుబడ్డ ఎలక్ట్రిసిటీ ఏఈ


పట్టుబడ్డ తహసీల్దార్ సందీప్‌రెడ్డి


పట్టుబడ్డ ఘట్‌కేసర్ సీఐ

### ఘట్‌కేసర్ సీఐపై సస్పెన్షన్ వేటు

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో వ్యవహార శైలిపై గత కొన్ని రోజులుగా వస్తున్న ఆరోపణలు నిజమని తేలడంతో, ఇన్స్పెక్టర్ ఎం.బాలస్వామిపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే.... తమకు న్యాయం కోసం వచ్చే ప్రతి పిటిషన్‌ను డబ్బుల కోణంలో చూస్తూ, బాధితులను వేధిస్తున్నాడని ఆరోపణలున్నాయి. భూ స్థలాలకు సంబంధించిన ఫిర్యాదులతో పాటు పలు కేసుల్లో నిందితుల వైపు సీఐ మొగ్గు చూపుతున్నారంటూ తీవ్ర విమర్శలు వచ్చాయి. సీఐ తీరుతో విసిగిపోయిన దాదాపు 12 మందికి పైగా బాధితులు సీపీకి నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదులపై స్పందించిన ఉన్నతాధికారులు అంతర్గత విచారణ జరిపి, ఇన్స్పెక్టర్ అవినీతి వ్యవహారాలకు సంబంధించిన సాక్షాదారాలు సేకరించి సీపీకి నివేదిక సమర్పించారు. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో సీపీ సుమతి బుధవారం ఇన్స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు..

### ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏఈ..

హైదరాబాద్ నగరంలోని సంతోష్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని మాదన్నపేట సెక్షన్ విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న పందాల సంధ్యారాకేష్ లంచం తీసుకుంటూ ఏసీబీఅధికారులకు పట్టుబడ్డాడు. పాత మీటర్ల స్థానంలో ఆరు కొత్త విద్యుత్ మీటర్లు ఇవ్వాలని కోరగా అందుకు లంచం డిమాండ్ చేయడంతో ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో గురువారం ఏఈ రూ. 1.20 లక్షల లంచం తీసుకుంటుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడినందుకు గాను అతడిపై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

# దళిత జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రజాస్వామ్యంపై దాడి

- ఘటనకు బాధ్యులైన పోలీసులపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి..
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత..



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దళిత జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ప్రజాస్వామ్యంపై దాడి అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో దళిత జర్నలిస్టులు పొత్తూరి శేఖర్, సంపత్ లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన గంభీరావు పేట్ ఎస్సై శ్రీకాంత్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం "ఎక్స్" లో పోస్ట్ చేశారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీకి పాల్పడిన ఎస్సై సహా మిగతా పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్సై భూ అక్రమాలు, పంచాయతీలు, సెటిల్ మెంట్లపై వార్తలు రాస్తే అక్రమ కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా అని ప్రశ్నించారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లోనే జర్నలిస్టుల నోట్లో గుడ్డలు కుక్కి, అత్యంత పాశవికంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి వారిని తీవ్రంగా హింసించారన్నారు. ఇది అత్యంత అమానుష చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు మేజిస్ట్రేట్ రిమాండ్ తిరస్కరించారంటే ఏ స్థాయిలో వారిపై పోలీసులు దాడి చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై ఈ తరహా దాడులు ఆక్షేపణీయమన్నారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని.. ఈ ఘటనకు బాధ్యుడైన గంభీరావుపేట ఎస్సై పై నామమాత్రపు చర్యలతో సరిపెట్టాలని చూస్తే అది పోలీసు వ్యవస్థకు మచ్చ తెస్తుందన్నారు. ఈ విషయంపై డీజీపీ వెంటనే స్పందించి ఎస్సైతో పాటు బాధ్యులపై వారందరిపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హర్షసాయి ట్రస్ట్ పేరుతో సైబర్ మోసం!

- గద్వాల జిల్లాలో సైబర్ మోసంపై కలకలం!
- రూ.2వేలు పంపితే 19వేలు ఇస్తామంటూ ఎర




**రాజోళి/గట్టు, అక్టోబర్ 15 (జనంసాక్షి):** సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రముఖ యూట్యూబర్ హర్షసాయి పేరును అడ్డుపెట్టుకుని, తక్కువ సమయంలోనే భారీగా డబ్బులు సంపాదించవచ్చంటూ అమాయకులకు వల వేస్తున్నారు. తాజాగా జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు మండలానికి సంబంధించిన వాట్సాప్ గ్రూపులో ఈ తరహా మోసం వెలుగులోకి వచ్చింది. 700 మందికి పైగా సభ్యులున్న గ్రూపును లక్ష్యంగా చేసుకుని, తాము హర్షసాయి టీమ్ సభ్యులమంటూ కొందరు వాట్సాప్ కాల్స్ చేస్తున్నారు. ముందుగా రూ. 2వేలు పంపిస్తే కేవలం ఐదు నిమిషాల్లోనే రూ. 19వేలు తిరిగి ఇస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో భారీ లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. ప్రముఖ యూట్యూబర్ పేరు వినిపించడంతో కొందరు నిజమేనని నమ్మే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, తాము పోలీసులమంటూ నమ్మించే ప్రయత్నం చేయడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి ఆకర్షణీయమైన మాటలు నమ్మి డబ్బులు పంపితే తిరిగి పొందడం కష్టమయ్యే అవకాశం ఉంది.

### అత్యాశకు పోయి మోసపోవద్దు!




వాట్సాప్ గ్రూపులో అనుమానాస్పద సందేశాలు, కాల్స్ వస్తే వెంటనే గ్రూప్ అడ్మిన్‌కు తెలియజేయాలి. గ్రూప్ హ్యాక్ అయిందని అనుమానం వస్తే అందులో వచ్చే సందేశాలను నమ్మకూడదు. తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాల సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి. గ్రామస్థాయి నుంచి పాఠశాలల వరకు అవగాహన కార్యక్రమాల ద్వారా సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు జిల్లా పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది.

-గద్వాల డీఎస్పీ, మొగులయ్య

# మొదటి అలైన్‌మెంట్ కొనసాగించాలి

## సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ కారిడార్, స్టేషన్ పోరాట అఖిల పక్ష కమిటీ కో -కన్వీనర్ అనంతుల మధు



**తుంగతుర్తి (జనంసాక్షి) :** మొదటి అలైన్ మెంట్ కొనసాగించాలని సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ కారిడార్, స్టేషన్ పోరాట అఖిల పక్ష కమిటీ కో – కన్వీనర్ అనంతుల మధు అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తొండ తిరుమల గిరి మండల కేంద్రంలో తెలంగాణ యువజన సంఘం కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారి డార్ ఉ స్టేషన్ ఏర్పాటు చేయాలనీ కోరుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో సుమారు 80 రోజులకు పైగా వివిధ పోరాట రూపాలలో ఉద్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకి నిరేత్తనట్లు ఉంది అని, కేంద్ర ప్రభుత్వం శంషాబాద్ నుండి చెన్నైవరకు సూర్యాపేట మీదుగా ప్రకటించిన మొదటి అలైన్ మెంట్ నే కొనసాగించాలని, సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చాలని డిమాండ్ చేసారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య అభివృద్ధి చెందుతున్న సూర్యాపేట మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు అవుతే, సూర్యాపేట ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు పై కేంద్ర బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేసారు. మొదటి అలైన్ మెంట్ మార్చడం అంటే సూర్యాపేట జిల్లా అభివృద్ధి ని అడ్డుకోవడమే అన్నారు. 63 రోజులుగా సూర్యాపేట జిల్లా కేంద్రం లో అఖిల పక్షం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయని, అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు , ఉమ్మడి నల్గొండ జిల్లా చట్ట సభ సభ్యులకు రిలే దీక్ష లు ప్రారంబానికి ముందే అఖిల పక్షం ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇచ్చామని, సూర్యాపేట జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అఖిల పక్షం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించామని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మొదటి అలైన్ మెంట్ మార్చే కుట్రలు జరుగుతున్న, సూర్యాపేట లో 80 రోజులకు పైగా అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమం జరుగుతున్న జిల్లా మంత్రి స్పందించక పోవడం శోచనీయం అన్నారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్, స్టేషన్ ఏర్పాటు కోసం సాగే ఉద్యమంలో తుంగతుర్తి ప్రాంత ప్రజలు, విద్యార్థి, యువత, వ్యాపార వేత్తలు, మేధావులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ ప్రకటించే వరకు ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ యువజన సంఘము సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోరెళ్ల విప్లవ్ కుమార్, తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షులు వీణ గఫార్ ఖాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బషీపంగు సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనిగా సంతోష్ రెడ్డి, హరీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత



**చింతలమానేపల్లి, అక్టోబర్ 15( జనం సాక్షి) :** మండల కేంద్రంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో గుడెం మార్గంలో పోలీసులు మాటు వేసి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న గంగాపూర్ గ్రామానికి చెందిన పాడిగి ప్రసాద్, సిర్పూర్‌కు చెందిన గాజిరెడ్డి సంతోష్, గొల్ల సంతోష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 110 గ్రాముల గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన మరో వ్యక్తి వద్ద దీన్ని కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారు.




# ఉద్యోగుల ఐక్యతనే టీజీఈజేఏసీ బలం..

- ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే సమస్యలపై ఒత్తిడి తెద్దాం
- ప్రజా ప్రభుత్వంలోనే ఎన్నో విజయాలు సాధించుకున్నాం
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు స్వేచ్ఛా వాతావరణం వచ్చిందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. గత పదేళ్ల ప్రభుత్వంలో పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను ఈ ప్రజా ప్రభుత్వంలో పరిష్కారం చేసిన ఘనత తెలంగాణ ఉద్యోగుల జేఏసీకే దక్కుతుందన్నారు. దీనికంతటికీ ప్రధాన కారణం మన ఉద్యోగుల జేఏసీలోని ఐక్యతనేనన్నారు. ఐక్యతతో ఉంటే భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించుకోవచ్చని.. ఇదే ఐక్యతతో ముందుకు సాగుదామని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లో ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. జేఏసీ నేత ఇక్బాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ ఏొడ్నాల రాజశేఖర్, జేఏసీ నాయకులు విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి సంక్షేమమే లక్ష్యంగా టీజీఈజేఏసీ పని చేస్తుందని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు ఉద్యోగుల హక్కుల కోసం ప్రభుత్వంతో కొట్లాడుతూనే.. మరోవైపు అదే ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ మన జేఏసీ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. భవిష్యత్తులోనూ మరెన్నో విజయాలను సాధించబోతుందన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు రెండు డీఏల విషయంలో మన జేఏసీ సాధించిన విజయమేనన్నారు. ఇదే కాకుండా ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం రావడం లోనూ, రూపాయి చెల్లించకుండా వైద్య సేవలు పొందడంలోనూ ప్రభుత్వ పెద్దల సహకారంతో మన జేఏసీ కృషి ఫలితమేనన్నారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకొని ఎన్నో ఉద్యోగుల సమస్యలు ఉన్నాయని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి పేర్కొన్నారు. అందుకోసమే ప్రతి ఉద్యోగి సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకొ నేందుకే ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్ర మానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్ర మంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయ కులు ఎస్.రాములు, కె.మహిపాల్‌రెడ్డి, బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, కృష్ణుడు, గరికె ఉపేంద్రరావు, హబీ బుద్దీన్, ఉపేందర్, శ్రీకాంత్‌గౌడ్, బాణాల రాంరెడ్డి, వర్రె భిక్షం, కె.రేణుక, బుచ్చయ్య, వై.కుమార్, అజీజ్, సుదర్శన్ గౌడ్, రాజేశ్వరరావు, మురళీ, శ్రీనివాస్, కృష్ణం రాజు, తిరుపతి, వేణు, అర్జున్ మల్లారం, శిరీషారెడ్డి, బుచ్చిబాబు, నర్సమ్మ, కె.సతీష్, పులిరాజు, మహేంద్ర, హరిప్ర సాద్, సర్వేశ్వర్, లక్ష్మయ్య, నాగరాజు, చిరంజీవి, వెంకటనరసింహారెడ్డి, శ్రీనివాస్, వినోద్ కుమార్, గిరిబాబు, వీరయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

# రాక్షసులుగా మారిన రక్షకులు

- జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం కాకి శాఖకు మాయని మచ్చ
- బాధిత జర్నలిస్టులను పరామర్శించిన టిఆర్పీ నేతలు
- ఎస్ఐ శ్రీకాంత్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలి
- విచారణ జరిపి సీఐ, డీఎస్పీ లను సస్పెండ్ చేయాలని టిఆర్పీ డిమాండ్
- టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్ (జనంసాక్షి) :** విధి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసి థర్డ్ డిగ్రీ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా అన్నారు. సిరిసిల్ల జిల్లా గాంబిరావుపేట ఎస్సై శ్రీకాంత్ చేసి థర్డ్ డిగ్రీ లో గాయపడిన బాధిత జర్నలిస్టులు రాతిపెల్లి సంపత్, శేకర్లను టీఆర్పీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. బాధిత జర్నలిస్టులకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అనంతరం టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మీడియాతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ, అధికారులను ప్రశ్నించే జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అత్యంత హేయమైన చర్య అని తీవ్రంగా మండిపడ్డారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. ఈ నెల 12వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో జర్నలిస్టులు రాతిపెల్లి సంపత్, శేకర్లను కరీంనగర్ పట్టణ కేంద్రంలో అరెస్టు చేసి గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం ఎస్ఐ శ్రీకాంత్ థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు బాధితులు తెలిపారని పేర్కొన్నారు. ఎస్సై థర్డ్ డిగ్రీ చేస్తూ సిఐ మరియు డిఎస్పీలకు వీడియో కాల్ చేసి చేయిస్తూ వారిని ఆమెకు దుర్భాశలాడుతూ కర్కశంగా ప్రవర్తించారని తెలిపారని అన్నారు. వార్తలు రాస్తే కక్ష సాధింపులా, పోలీసులను ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని అఖిల్ పాషా హెచ్చరించారు. అనేక అవినీతి ఆరోపణలు ఉన్న ఎస్సై శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదును సిఐ వెంకటేష్ మరియు డిఎస్పీ పరిశీలించకుండా ఎస్సై పాల్పడ్డ ఘటనకు సహకరించిన పోలీసు ఉన్నతాధికారులు సిఐ డిఎస్పీలపై జిల్లా ఎస్పీ నిష్పక్షపాత విచారణ జరిపించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ శ్రీకాంత్‌ను ఈ రోజు ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్టు తెలిసిందని అటాచ్ చేయడం మాత్రమే సరిపోదని, శాశ్వతంగా సర్వీస్ ఫర్ రిమువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో బాధ్యత ఉన్నట్లు తేలితే సీఐ వెంకటేశ్, డీఎస్పీ నాగేంద్రచారిలను కూడా సస్పెండ్ చేయాలని కోరారు. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు టీఆర్పీ పోరాటం ఆగదని పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో బాధిత జర్నలిస్టులకు న్యాయం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడతాం అని అఖిల్ పాషా స్పష్టం చేశారు. వారితో పాటు పార్టీ నాయకులు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కొత్తపెల్లి మండల అధ్యక్షుడు ఓర్సు రాజు నాయకులు వెంకట్ గౌడ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

## ప్రెజర్ కుక్కర్‌కు వాల్వ్ లేకపోతే పేలిపోతుంది!

# ప్రశ్నించడం ప్రజాస్వామిక హక్కు

**ప్రజల గొంతును అణచివేయడం వల్ల అసంతృప్తి అంతరించదు. వినడం, చర్చించడం, పరిష్కరించడం ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రెజర్ కుక్కర్‌కు వాల్వ్ ఎంత అవసరమో.. ప్రజాస్వామ్యానికి నిరసన హక్కు అంతే అవసరం. ప్రశ్నించడం నేరం కాదు.. ప్రజాస్వామిక హక్కు!**

జంతర్‌మంతర్ అంటే ఢిల్లీలో ఒక చిరునామా మాత్రమే కాదు. అధికారం చెవిలో సామాన్య పౌరుడు తన గొంతు వినిపించే ప్రజాస్వామిక వేదిక. రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, న్యాయం కోసం పోరాడే బాధితులు, పించన్ల కోసం ఎదురుచూసే వృద్ధులు దశాబ్దాలుగా తమ ఆవేదనను అక్కడే వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వేదికపై నిరసనలకు ఆంక్షలు విధించడం అంటే ఒక స్థలాన్ని పరిమితం చేయడం మాత్రమే కాదు.. ప్రజల గొంతుకకు అడ్డుకట్ట వేయడమే.

రాజ్యాంగంలోని 19(1)(ఏ), 19(1)(బి) అధికరణాలు భావప్రకటనా స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తున్నాయి. అయితే ఈ హక్కులకు చట్టబద్ధమైన, సహేతుకమైన పరిమితులు ఉండవచ్చు. కానీ పరిమితుల పేరుతో నిరసనలకే తలుపులు మూసేస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. పార్లమెంటుకు కూతవేటు దూరంలోనే ప్రజలు తమ సమస్యలను చెప్పుకోలేని పరిస్థితి వస్తే, ప్రజల తరఫున పాలించే వ్యవస్థకు అర్థమేముంటుంది?

ప్రభుత్వాలు ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ప్రెజర్ కుక్కర్‌కు వాల్వ్ ఎందుకు ఉంటుంది? లోపల పేరుకుపోయే ఆవిరి బయటకు వెళ్లడానికి! వాల్వ్ మూసేస్తే ఒత్తిడి తగ్గదు.. చివరికి కుక్కర్ పేలిపోయే ప్రమాదం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నిరసనలూ అంతే. ప్రజల అసంతృప్తి, ఆవేదన, ఆగ్రహం శాంతియుతంగా బయటపడేందుకు నిరసనలు ఒక మార్గం. ఆ మార్గాన్ని మూసివేసినంత మాత్రాన సమస్యలు మాయమైపోవు. అసంతృప్తి మరింత పేరుకుపోతుంది. అందుకే ప్రజల గొంతు వినడం పాలకుల బలహీనత కాదు.. బాధ్యత.

నిరసనలు అధికారులకు అసౌకర్యం కలిగించవచ్చు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చు. నినాదాలు చికాకు పెట్టవచ్చు. విమర్శలు పాలకులకు నచ్చకపోవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో అసౌకర్యాన్ని భరించాల్సిన బాధ్యత అధికారానికీ ఉంది. ప్రజలంతా మౌనంగా ఉన్నంత మాత్రాన దేశం ప్రశాంతంగా ఉన్నట్లు కాదు. భయం వల్ల గొంతులు మూగబోయినా అది ప్రజాస్వామ్య విజయానికి కొలమానం కాదు. రైతుల ఉద్యమాల నుంచి మహిళా రెజ్లర్ల నిరసనల వరకు ఎన్నో సందర్భాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. నిరసనల ద్వారా ప్రతి డిమాండూ నెరవేరుతుందని చెప్పలేం. కానీ సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వాలను సమాధానం చెప్పేలా చేయడంలో శాంతియుత నిరసనలకు కీలక పాత్ర ఉంది.

**పాలకులకు సూటి ప్రశ్న ఒక్కటే.. ప్రశ్నలను ఎందుకు భరించలేకపోతున్నారు? నిర్ణయాలు సరైనవని నమ్మితే విమర్శలకు సమాధానం చెప్పాలి. సమస్యలు లేవని భావిస్తే ప్రజలకు వివరించాలి. అంతేకానీ ప్రశ్నించే వేదికలనే కుదించడం పరిష్కారం కాదు. ప్రజల ఆవేదనను వినకుండా ఆంక్షలతో అణచివేయాలనుకోవడం సమస్యను మరింత జటిలం చేయవచ్చు.**

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఎన్నికల తర్వాత కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నిర్ణయాలను విమర్శించడం, సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాడటం ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. అధికారం ప్రజల నుంచి వస్తుంది. అందుకే ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా అధికారానిదే.

# వేలాది జంతర్ మంతర్‌లు ప్రతిచోటా పుట్టుకొస్తాయి!

ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించడం, ఓట్లు లెక్కించడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం మాత్రమే కాదు. ప్రజలకు తమ పాలకులను ప్రశ్నించే హక్కు ఉండాలి. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే స్వేచ్ఛ ఉండాలి. తమ హక్కులకు భంగం కలిగినప్పుడు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపే అవకాశం ఉండాలి. ఈ హక్కులన్నీ కలిసినప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన పాలకులు, ఆ ప్రశ్నలు వినిపించే వేదికలనే మూసివేయడానికి ప్రయత్నిస్తే ప్రజాస్వామ్య పునాదులకే ముప్పు ఏర్పడుతుంది. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ చుట్టూ చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు ఈ కీలక ప్రశ్ననే ముందుకు తెస్తున్నాయి. విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల కార్యకర్తలు తమ సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు దశాబ్దాలుగా ఉపయోగించుకుంటున్న నిరసన వేదిక జంతర్ మంతర్. అది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు. అధికారాన్ని ప్రశ్నించే ప్రజాస్వామిక హక్కుకు ప్రతీక. అక్కడ వినిపించే ప్రతి నినాదం ప్రభుత్వానికి వ్యతిరేకమైనదే కావాల్సిన అవసరం లేదు. కానీ ప్రజల అసంతృప్తి, ఆకాంక్షలు, ఆవేదనలు అధికారానికి చేరవేయడంలో ఆ వేదిక కీలక పాత్ర పోషిస్తోంది. అలాంటి వేదికపై ఆంక్షలు విధించడం, నిరసనలకు అనుమతులు నిరాకరించడం, ప్రత్యామ్నా యంగా మారుమూల ప్రాంతాలను సూచించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్వేచ్ఛ పరిధిని కుదించే ప్రమాదం ఉంది. నిరసనకారులకు ఒక చోటు చూపించి, ప్రజలకు కనిపించకుండా నిరసనలను దూరంగా నెట్టేస్తే సమస్య పరిష్కారమైనట్టేనా? ప్రజలు ఎక్కడ సమావేశమవ్వాలో నిర్ణయించడం కంటే, వారు ఎందుకు నిరసనకు దిగుతున్నారో తెలుసుకోవడం ప్రభుత్వానికి ముఖ్యం కాదా?

### నిరసన హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం

భారత రాజ్యాంగం పౌరులకు భావప్రకటనా స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కల్పించింది. ఈ హక్కులకు రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేసే పేరుతో ప్రజల నిరసన స్వరాన్నే మూసివేయలేరు. శాంతియుత నిరసన అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు కాదు. పాలకులు తమ విధానాలను సమీక్షించుకోవడానికి, ప్రజల సమస్యలను గుర్తించడానికి, ప్రజా అసంతృప్తికి కారణాలను అర్థం చేసుకోవడానికి అది ఒక అవకాశం. ప్రజలు తమ సమస్యలను సభల్లో, సమావేశాల్లో, వినతిపత్రాల్లో వ్యక్తం చేసినా పరిష్కారం దొరకనప్పుడు వీధుల్లోకి వస్తారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం పోరాడుతుంది. రైతులు గిట్టుబాటు ధరల కోసం ఉద్యమిస్తారు. కార్మికులు వేతనాల పెంపు కోసం సమ్మె చేస్తారు. విద్యార్థులు విద్యా హక్కుల కోసం ఆందోళన చేస్తారు. ఓటర్ల జాబితాల్లో తమ పేర్లు తొలగించబడినట్లు భావించే పౌరులు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని డిమాండ్ చేస్తారు. వీటన్నింటినీ శాంతిభద్రతల సమస్యగా మాత్రమే పరిగణిస్తే ప్రజాస్వామ్యానికి అర్థం మిగలదు. నిరసనలకు కొన్ని నియమాలు అవసరమని చెప్పవచ్చు. ప్రజా రవాణాకు, అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికీ, నిర్వాహకులకూ ఉంటుంది. అయితే ఆ నియమాలు ప్రజల హక్కులను కాపాడేందుకు ఉండాలి తప్ప, నిరసనలను అసాధ్యం చేసేందుకు ఉపయోగపడకూడదు. పరిమితులు సహేతుకంగా, పారదర్శకంగా, అందరికీ సమానంగా అమలుకావాలి. ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై మాత్రమే వాటిని ప్రయోగిస్తే వాటి నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతాయి.

### బోట్ క్లబ్ నుంచి జంతర్ మంతర్ వరకు!

ఢిల్లీలో నిరసన వేదికల చరిత్రను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. ప్రజలు తమ సమస్యలను అధికార కేంద్రాల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ, నిరసనలకు అనుమతించే ప్రదేశాల విషయంలో వివాదాలు తలెత్తుతూనే ఉన్నాయి. బోట్ క్లబ్ ప్రాంతం నుంచి ఇండియా గేట్ పరిసరాల వరకు, అక్కడి నుంచి జంతర్ మంతర్ వరకు నిరసనల భౌగోళిక పరిధి మారుతూ వచ్చింది. ఇప్పుడు జంతర్ మంతర్‌లోనూ నిరసనలకు ఆంక్షలు పెరిగితే ప్రజలు తమ గళాన్ని ఎక్కడ వినిపించాలన్న ప్రశ్న ముందుకొస్తుంది. పార్లమెంటు ప్రజల ప్రాతినిధ్యానికి అత్యున్నత వేదిక. కానీ పార్లమెంటు వెలుపల ప్రజలు తమ సమస్యలను వినిపించుకోవడానికి కూడా ప్రజాస్వామ్యంలో స్థానం ఉండాలి. అధికార కేంద్రాలకు ప్రజల గొంతుకలు చేరకుండా నిరసనలను నగర శివార్లకు పరిమితం చేయడం సమస్యలను పరిష్కరించదు.

ప్రజల అసంతృప్తిని మాత్రమే కనుమరుగు చేయగలదు. సమస్య మాత్రం అలాగే మిగిలిపోతుంది. ప్రజాస్వామ్యానికి అందం విమర్శలను సహించడంలో ఉంది. భిన్నాభిప్రాయాలను అనుమతించడంలో ఉంది.

అధికారాన్ని ప్రశ్నించే హక్కును కాపాడటంలో ఉంది. పాలకులు తమకు అనుకూలమైన నినాదాలనే వినాలనుకుంటే, తమ విధానాలను సమర్థించే సభలకే స్వాగతం పలికితే, వ్యతిరేక స్వరాలను అణచివేయాలనుకుంటే ప్రజాస్వామ్యం క్రమంగా ఏకపక్ష




పాలన దిశగా పయనించే ప్రమాదం ఉంటుంది.

### ఓటు హక్కుపై ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసనలు జరుగుతున్నాయి. ఓటర్ల జాబితాల సవరణ అనేది ఎన్నికల నిర్వహణలో కీలకమైన ప్రక్రియ. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందుబాటులో ఉండటం, అనర్హమైన నమోదులను తొలగించడం, ఈ ప్రక్రియలో పారదర్శకత పాటించడం ఎన్నికల విశ్వసనీయతకు అవసరం. అదే సమయంలో, సవరణల వల్ల అర్హులైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడుతున్నాయని, సవరణ ప్రక్రియలో తగిన పారదర్శకత లేదని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేస్తే, ఆ ఆరోపణలను ఆధారాలతో పరిశీలించి సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత సంబంధిత ఎన్నికల అధికారులపై ఉంటుంది. ఎన్ని పేర్లు తొలగించబడ్డాయి? వాటిలో అర్హులైన ఓటర్లు ఎంతమంది? అభ్యంతరాలు తెలిపేందుకు, తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు ప్రజలకు తగిన అవకాశం కల్పించారా? ప్రక్రియలో తప్పులు జరిగితే వాటిని సరిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. ఓటు అనేది కేవలం ఎన్నికల రోజున వేసే గుర్తు కాదు. అది పౌరుడి రాజకీయ సమానత్వానికి పునాది. ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోయిన వ్యక్తికి ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం దెబ్బతింటుంది. అందువల్ల ఓటర్ల జాబితాలపై ప్రజల్లో తలెత్తే సందేహాలను నిరసనల ద్వారా వ్యక్తం చేయడాన్ని శత్రుత్వంగా చూడకుండా, ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని బలోపేతం చేసుకునే అవకాశంగా పరిగణించాలి.

### అణచివేతతో అసంతృప్తి అంతరించదు

నిరసనకారులను బారికేడ్లతో అడ్డుకోవచ్చు. సభలకు అనుమతులు నిరాకరించవచ్చు. నిరసనల్లో పాల్గొన్న వారిని అరెస్టు చేయవచ్చు. కానీ ప్రజల సమస్యలను, వారి అసంతృప్తికి కారణాలను అలా తొలగించలేరు. ఒక వేదికను మూసివేస్తే మరో వేదిక కోసం ప్రజలు వెతుకుతారు. ఒక చోట నినాదాలను అడ్డుకుంటే మరొకచోట అవి వినిపిస్తాయి. ఒక సమూహాన్ని చెదరగొడితే మరో సమూహం ప్రశ్నలతో ముందుకొస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ఉద్యమాల చరిత్ర ఇదే విషయాన్ని చెబుతోంది. హక్కుల కోసం సాగిన పోరాటాలు అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నాయి. అయినా ప్రజల ఆకాంక్షలను పూర్తిగా అణచివేయడం సాధ్యం కాలేదు. భారత స్వాతంత్ర్య ఉద్యమం నుంచి కార్మిక, రైతాంగ, విద్యార్థి ఉద్యమాల వరకు ప్రజలు తమ హక్కుల కోసం ఎన్నో త్యాగాలు చేశారు. నిరసన తెలిపే హక్కు ప్రజలకు పాలకులు ఇచ్చిన బహుమతి కాదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధంగా గుర్తింపు పొందిన పౌర హక్కు. అందుకే జంతర్ మంతర్‌ను మూసివేయడం లేదా అక్కడ నిరసనలను కట్టడి చేయడం ద్వారా ప్రజల ప్రశ్నలకు తెరపడుతుందని ఎవరైనా భావిస్తే అది పొరపాటు. నిరసన వేదికల సంఖ్యను తగ్గించవచ్చు. కానీ నిరసనకు కారణమైన సమస్యలను తొలగించకుండా ప్రజల ఆవేదనను అంతం చేయలేరు.

### ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

ప్రజాస్వామ్యం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు. అది ప్రతి పౌరుడి భాగస్వామ్యంతో సజీవంగా ఉంటుంది. అధికారంలో ఉన్నవారు విమర్శలను స్వీకరించాలి. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను ముందుకు తీసుకురావాలి. న్యాయవ్యవస్థ పౌర హక్కుల పరిరక్షణలో తన రాజ్యాంగబద్ధ పాత్రను నిర్వర్తించాలి. ఎన్నికల సంఘం తన నిర్ణయాలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలి. పౌర సమాజం, విద్యార్థులు, యువత, ప్రజా సంఘాలు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు అప్రమత్తంగా ఉండాలి. జంతర్ మంతర్‌ను నిరసనలకు అనువైన వేదికగా కొనసాగించాలన్న డిమాండ్‌ను ఒక రాజకీయ పార్టీ లేదా ఒక నిరసన బృందం సమస్యగా మాత్రమే చూడకూడదు. రేపు వేరే ప్రభుత్వం అధికారంలో ఉన్నా, వేరే పార్టీ నిరసనకు దిగినా, వేరే సామాజిక వర్గం తన హక్కుల కోసం గళమెత్తినా అదే స్వేచ్ఛ అందుబాటులో ఉండాలి. ప్రజాస్వామ్య హక్కుల విలువ మనకు నచ్చినవారు వాటిని వినియోగించుకున్నప్పుడే కాదు, మనకు నచ్చని అభిప్రాయాలను వ్యక్తం చేసేవారికీ ఆ హక్కులు ఉన్నప్పుడే తెలుస్తుంది. శాంతియుత నిరసనలకు అనుకూలమైన, ప్రజలకు అందుబాటులో ఉండే వేదికలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. ప్రజల సమస్యలకు సమాధానాలు చెప్పడం దాని కర్తవ్యం. నిరసనకారులను అడ్డుకోవడం కంటే వారి డిమాండ్లను వినడం, విమర్శకులను శత్రువులుగా చూడటం కంటే వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ప్రజాస్వామ్య పాలనకు అసలైన పరీక్ష. జంతర్ మంతర్‌ను మూసివేసినా ప్రజల ప్రశ్నలు మూతపడవు. నిరసన వేదికలను కుదించినా ప్రజాస్వామ్య ఆకాంక్షలు అంతరించవు. ఓటు హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ, శాంతియుత సమావేశాల హక్కు వంటి రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడాలన్న ప్రజల ఆకాంక్షను ఆంక్షలతో శాశ్వతంగా అడ్డుకోలేరు. జంతర్ మంతర్ ఒక్కటే కాదు.. ప్రజల గొంతుక వినిపించే ప్రతి వీధి, ప్రతి పట్టణం, ప్రతి పల్లె ప్రజాస్వామ్య వేదిక కావచ్చు. ఒక వేదికను మూసివేస్తే మరో వేదిక పుడుతుంది. ఒక గొంతును అణచివేస్తే మరెన్నో గొంతులు వినిపిస్తాయి. ప్రజల హక్కులకు తాళాలు వేయాలనుకుంటే చరిత్ర కొత్త తలుపులు తెరుస్తుంది. అందుకే ప్రజల గొంతుకలను మూయించాలనుకునే ప్రతి ప్రయత్నానికి సమాధానం ఒక్కటే, వేలాది జంతర్ మంతర్‌లు ప్రతిచోటా పుట్టుకొస్తాయి!



మామిండ్ల రమేష్ రాజా
సెల్ : 78932 30218

# తెలంగాణ రాజకీయాల్లో హుందాతనం ఏది!?

ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులు ఉండాలి.. కానీ వ్యక్తిగత శత్రుత్వాలు ఉండకూడదు! అధికార పక్షాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు.. విమర్శలను స్వీకరించి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడం అధికార పక్షం బాధ్యత. అయితే ఈ ప్రజాస్వామ్య సూత్రాలకు భిన్నంగా తెలంగాణ రాజకీయాల్లో కొన్ని సోషల్ మీడియా ప్రచారాలు సాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదికలు వ్యక్తిగత దూషణలకు, నిరాధార ఆరోపణలకు, కుటుంబ సభ్యులపై అభ్యంతరకర వ్యాఖ్యలకు కేంద్రాలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారమే రాజకీయాల పరమావధి కావాల్సిన చోట.. లైకులు, వ్యూస్, రాజకీయ పైచేయి కోసం కొందరు దిగజారుడు ప్రచారానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలను పలుచన చేస్తోంది. తెలంగాణ ఉద్యమం నుంచి ఆశించిన రాజకీయ సంస్కృతి ఇదేనా? విమర్శల్లో పదును ఉండాలి.. భాషలో హుందాతనం ఉండాలి. ప్రత్యర్థిని ప్రశ్నించాలి.. కానీ వ్యక్తిత్వాన్ని కించపరచకూడదు. ఈ కనీస రాజకీయ మర్యాదను గుర్తుచేసేందుకే నేటి పరిస్థితులపై చర్చించాల్సిన అవసరం ఉంది.

### వ్యక్తిగత ఆరోగ్యంపైనా రాజకీయ రాద్ధాంతమా!

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జ్వరం కారణంగా రెండు రోజులపాటు విశ్రాంతి తీసుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించడంతో వివాదం మొదలైంది. ఆయన ఆరోగ్య పరిస్థితిని కొందరు రాజకీయ ప్రత్యర్థుల మద్దతుదారులు అనుమానాస్పదంగా చిత్రీకరిస్తూ, దర్యాప్తు సంస్థల భయం వల్లే విశ్రాంతి తీసుకుంటున్నారనే ప్రచారం చేసినట్లు వార్తలు వచ్చాయి.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని కొందరు బీఆర్ఎస్ మద్దతుదారులు, కాంగ్రెస్ వ్యతిరేక సోషల్ మీడియా ఖాతాల ద్వారా అభ్యంతరకర పోస్టులు ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యక్తిగత జీవితం, కుటుంబ సభ్యులను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం, మార్ఫింగ్ చిత్రాలు లేదా వివాదాస్పద కంటెంట్ ప్రచారం చేయడం రాజకీయ వాతావరణాన్ని మరింత కలుషితం చేస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ప్రచారాలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు, కేసులు నమోదైనట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ప్రతి ఆరోపణలోనూ వాస్తవాలను దర్యాప్తు ద్వారా నిర్ధారించాలి. ఆరోపణనే నేర నిర్ధారణగా భావించకూడదు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నాయకుల పనితీరు, నిర్ణయాలు, విధానాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ గౌరవాన్ని రాజకీయ అస్త్రాలుగా మార్చడం మాత్రం ఆరోగ్యకరమైన రాజకీయ సంస్కృతి కాదు. విమర్శకు సమాధానం విమర్శతోనే ఇవ్వాలి.. కక్షతో కాదు.

### లైకులు,వ్యూస్ కోసం విలువలకు తిలోదకాలా!

యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వేదికలు రాజకీయ ప్రచారానికి కీలక సాధనాలుగా మారాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడానికి, ప్రభుత్వ నిర్ణయాలపై చర్చించడానికి, ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి వీటికి అపారమైన అవకాశం ఉంది. అదే సమయంలో కొన్ని ఖాతాలు లైకులు, వ్యూస్, వైరల్ ప్రచారమే లక్ష్యంగా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. నిజానిజాలు నిర్ధారించకుండా ఆరోపణలను వ్యాప్తి చేయడం, ప్రత్యర్థుల కుటుంబ సభ్యులను వివాదాల్లోకి లాగడం, అసంపూర్ణ సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించడం ప్రజాస్వామ్య చర్చల నాణ్యతను దెబ్బతీస్తాయి.

సామాజిక మాధ్యమాల్లో వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉన్నంత మాత్రాన ఏది పడితే అది ప్రచారం చేసే హక్కు ఉన్నట్లు కాదు. విమర్శకు ఆధారాలు ఉండాలి.. ఆరోపణకు విశ్వసనీయత ఉండాలి.. భాషకు సంస్కారం ఉండాలి. రాజకీయంగా విభేదించడం తప్పు కాదు; అసత్యాన్ని సత్యంగా ప్రచారం చేయడం, అవమానాన్ని ఆయుధంగా మార్చడం మాత్రం బాధ్యతారాహిత్యం. డిజిటల్ వేదికలపై అభిప్రాయ భేదాలు ఉండవచ్చు.. కానీ అవి వ్యక్తిగత విద్వేషాలకు దారితీయకూడదు.

### ప్రత్యర్థులు శత్రువులు కాదు.. బాధ్యతే రాజకీయానికి పునాది!

అధికార, ప్రతిపక్షాలు ప్రజాస్వామ్యానికి రెండు కళ్ల వంటివి. ఒకటి ప్రభుత్వ విధానాలను అమలు చేస్తే, మరొకటి వాటిని ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడాలి. పరస్పర విమర్శలు, వాదోపవాదాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. అయితే రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా భావించడం, వ్యక్తిగత కక్షలను పెంచుకోవడం ప్రజా జీవితానికి మేలు చేయదు. నాయకుల మధ్య మొదలయ్యే దూషణల సంస్కృతి క్షేత్రస్థాయి కార్యకర్తల మధ్య ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉంది. అందుకే రాజకీయాల్లో మాటలకూ, విమర్శలకూ హద్దులు అవసరం.

సోషల్ మీడియా విభాగాల కార్యకలాపాలపై పార్టీల అగ్ర నాయకత్వం బాధ్యత తీసుకోవాలి. అదే సమయంలో విమర్శల పేరుతో చట్టబద్ధమైన భావప్రకటనను అణచివేయకుండా, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించాలి. ప్రజలకు కూడా బాధ్యత ఉంది. సామాజిక మాధ్యమాల్లో కనిపించే ప్రతి పోస్టునూ నిజమని నమ్మకూడదు. దాని మూలం, సందర్భం, విశ్వసనీయతను పరిశీలించకుండా ఇతరులకు పంపకూడదు. తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేయకుండా ఆపడం కూడా పౌర బాధ్యతే.

తెలంగాణ రాజకీయాల్లో హుందాతనం తిరిగి రావాలంటే నాయకులు మాటలతో కాదు, చేతలతో ఆదర్శంగా నిలవాలి. ప్రజా సమస్యలపై పోరాడాలి.. పాలనా వైఫల్యాలను ఆధారాలతో ఎండగట్టాలి.. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిలదీయాలి. కానీ వ్యక్తిగత దూషణలకు, కుటుంబాలపై అవమానకర ప్రచారానికి దూరంగా ఉండాలి. ప్రజలు నాయకులను ఎన్నుకునేది పరస్పరం బురద చల్లుకోవడానికి కాదు.. తమ బతుకుల్లో వెలుగులు నింపడానికి! లైకులు, వ్యూస్ తాత్కాలికమే.. ప్రజల విశ్వాసం శాశ్వతం. ప్రత్యర్థిని కించపరిచినంత మాత్రాన నాయకత్వం పెరగదు; ప్రజల సమస్యను పరిష్కరించినప్పుడే గౌరవం పెరుగుతుంది. అందుకే రాజకీయాల్లో కక్షకు కాదు.. కర్తవ్యానికి, దూషణకు కాదు.. చర్చకు, వ్యక్తిగత ఆధిపత్యానికి కాదు.. ప్రజాహితానికి పెద్దపీట వేయాలి. రాజకీయ పోరాటం విధానాలపై సాగాలి.. వ్యక్తుల గౌరవాన్ని బలితీసుకోకూడదు. అదే నిజమైన ప్రజాస్వామ్య హుందాతనం!.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# కొత్త పార్టీనా..? కొత్త ఫ్రంటా..? కొత్త ఐక్యతా..?

తెలంగాణ రాజకీయాల్లో వామపక్ష రాజకీయాల భవిష్యత్తుపై మరోసారి చర్చ మొదలైంది. ఒకవైపు ఇప్పటికే ఉన్న పార్లమెంటరీ వామపక్ష పార్టీలు ఐక్యత, సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు మాజీ మావోయిస్టులలో కొందరు కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇటీవల బహిరంగ రాజకీయ జీవితంలోకి వచ్చిన కొందరు మాజీ మావోయిస్టు నేతలు మాత్రం ఆ ప్రతిపాదిత పార్టీతో తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ, వామపక్ష, ప్రజాస్వామిక, దళిత, ఆదివాసీ, బహుజన, మైనారిటీ శక్తులతో కలిసి ఐక్య ఫ్రంట్ నిర్మాణం గురించి మాట్లాడుతున్నారు. ఈ మూడు పరిణామాలు వేర్వేరు నేపథ్యాల నుంచి వచ్చినప్పటికీ, ఒకే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. తెలంగాణలో వామపక్ష, ప్రజాతంత్ర రాజకీయాలకు కొత్త రాజకీయ సమీకరణ అవసరమా..? అవసరమైతే దాని రూపం ఎలా ఉండాలి..? అయితే సమాధానం కేవలం కొత్త పార్టీ వస్తుందా, కొత్త ఫ్రంట్ ఏర్పడుతుందా అన్నదానిలో లేదు. భిన్న వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు తమ సిద్ధాంత భేదాలను కొనసాగిస్తూనే ప్రజా సమస్యలపై కలిసి పనిచేయగలవా అన్నదే అసలు ప్రశ్న.

ఐక్యత గురించి మాట్లాడటం సులభం. ఆచరణలో నిలబెట్టడం అంత సులభం కాదు. సిద్ధాంత భేదాలతో పాటు చరిత్ర, గత రాజకీయ విభేదాలు, సంస్థాగత ప్రయోజనాలు, నాయకత్వంపై అనుమానాలు, రాజకీయ గుర్తింపులు కూడా అడ్డుగా నిలుస్తాయి. ఒక కార్యకర్తకు పార్టీ కేవలం ఒక కార్యాలయం లేదా జెండా కాదు. అతని పోరాటాలు, త్యాగాలు, విజయాలు, ఓటములు, జ్ఞాపకాలతో ముడిపడిన రాజకీయ జీవితం. అందుకే మరో సంస్థపై విమర్శను కొన్నిసార్లు సిద్ధాంతపరమైన విమర్శగా కాకుండా తన రాజకీయ జీవితంపైనే దాడిగా భావించే పరిస్థితి ఏర్పడుతుంది. అక్కడి నుంచే "వాళ్లు – మనం" అనే భావన బలపడుతుంది.

ఇక్కడే వామపక్ష రాజకీయాలకు ఆత్మపరిశీలన అవసరం. ఐక్యత కోసం ప్రతి పార్టీ తన చరిత్రను వదులుకోవాల్సిన అవసరం లేదు. ప్రతి సిద్ధాంత భేదాన్ని వెంటనే తొలగించాల్సిన అవసరం కూడా లేదు. కానీ భిన్నాభిప్రాయాలతో కలిసి పనిచేయగల రాజకీయ సంస్కృతిని నిర్మించాల్సిన అవసరం ఉంది. కె. బాలగోపాల్ ఆలోచన ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన మేధోపరమైన ప్రమాణాన్ని గుర్తు చేస్తుంది. ఒక ఉద్యమాన్ని దాని ప్రకటిత లక్ష్యాలతో మాత్రమే అంచనా వేయకూడదు.

ఆ లక్ష్యాలను సాధించడానికి అనుసరించే పద్ధతులు, మానవ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, విమర్శ, రాజకీయ బాధ్యతలతో దాని సంబంధాన్ని కూడా పరిశీలించాలి. లక్ష్యం ఎంత గొప్పదో మాత్రమే కాదు.. దానికి వెళ్లే మార్గం కూడా అంతే ముఖ్యం. ఈ ప్రమాణాన్ని ఐక్యతకు అన్వయిస్తే, భిన్నాభిప్రాయాన్ని శత్రుత్వంగా చూసే చోట ఐక్యత నిలబడదు. విమర్శను అవిశ్వాసంగా భావించే చోట సమన్వయం పెరగదు. గత తప్పులపై చర్చించడాన్ని సంస్థపై దాడిగా భావించే చోట రాజకీయ పరిపక్వత ఏర్పడదు. అందువల్ల వామపక్ష ఐక్యతకు మొదటి అవసరం సంస్థల విలీనం కాదు, భిన్నత్వాన్ని ప్రజాస్వామికంగా నిర్వహించే రాజకీయ సంస్కృతి. ఇదే సమయంలో వామపక్ష రాజకీయాలు పనిచేయాల్సిన సమాజం కూడా మారిపోయింది.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అసంఘటిత, గిగ్ పనులు వంటి కొత్త ఉపాధి రూపాలు పెరిగాయి. కులం, వర్గం, లింగం, సామాజిక గౌరవం, పర్యావరణం, ప్రజాస్వామిక హక్కుల ప్రశ్నలు పరస్పరం ముడిపడ్డాయి. యువత రాజకీయ అనుభవం కూడా గత తరాల కంటే భిన్నంగా ఉంది. ఈ కొత్త వాస్తవాన్ని పాత రాజకీయ భాషతోనే పూర్తిగా వివరించగలమా..? ఈ ప్రశ్నను మాత్రం తప్పించుకోలేం.

ఇటీవల మాజీ మావోయిస్టులలో కొందరు బహిరంగ రాజకీయ జీవితంలోకి రావడం ఈ చర్చకు మరో కోణాన్ని తెచ్చింది. దీన్ని కేవలం కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించిన పరిణామంగా చూడటం సరిపోదు. అండర్‌గ్రౌండ్ రాజకీయాల నుంచి బహిరంగ ప్రజాస్వామిక రాజకీయాల వైపు వచ్చిన వారు తమ గత అనుభవాలను కొత్త రాజకీయ వాస్తవికతతో ఎలా అనుసంధానించుకుంటారన్నదీ ముఖ్యమైన ప్రశ్న. అయితే స్పష్టత అవసరం. బహిరంగ రాజకీయ జీవితంలోకి వచ్చిన మాజీ మావోయిస్టుల రాజకీయ ప్రయాణాన్ని, ఇంకా అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మావోయిస్టు ఉద్యమాన్ని, పార్లమెంటరీ వామపక్ష రాజకీయాలను ఒకే రాజకీయ ప్రవాహంగా చూడటం సరైంది కాదు.

వాటి రాజకీయ పద్ధతులు, సంస్థాగత నిర్మాణాలు, పరిస్థితులు వేర్వేరు. కానీ వీటన్నింటి మధ్య ముందుకొచ్చే పెద్ద ప్రశ్న మాత్రం ఒకటే వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు తమ మధ్య ఉన్న భేదాలను ఎలా నిర్వహించుకోగలవు..? దీనికి ఆచరణాత్మక మార్గం ఉంది. ముందుగా సంస్థల విలీనం కాకుండా ఉమ్మడి కార్యాచరణ మొదలవ్వాలి. కార్మికులు, రైతులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక హక్కులు, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రజా సమస్యలపై కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించి కలిసి పనిచేయవచ్చు. ఆచరణలో ఏర్పడే అనుభవం పరస్పర అవగాహనను, విశ్వాసాన్ని పెంచుతుంది. ఆ తర్వాత అవసరమైతే సంస్థాగత ఐక్యత గురించి ఆలోచించవచ్చు. అంటే విలీనం మొదటి అడుగు కాకుండా చివరి ఫలితం కావాలి. అయితే ఇక్కడ మరో కీలకమైన ప్రశ్నలు ఉన్నాయి. ఎవరు నాయకత్వం వహిస్తారు..? ఎవరి ప్రాతినిధ్యం ఎంత..? నిర్ణయాలు ఎలా తీసుకుంటారు..? చిన్న సంస్థకు, పెద్ద సంస్థకు సమాన గౌరవం ఉంటుందా..? విమర్శించే హక్కు ఉంటుందా..? భిన్నాభిప్రాయానికి స్థానం ఉంటుందా..?

ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకుండా 'ఐక్యత' ప్రకటిస్తే అది మరో సంస్థాగత ప్రయోగంగా మాత్రమే మిగిలిపోవచ్చు. అందుకే ఇప్పుడు ముందున్న ప్రశ్నలు కొత్త పార్టీనా..? కొత్త ఫ్రంటా..? కొత్త ఐక్యతా..? వీటన్నింటికంటే ముందు మరో ప్రశ్నను అడగాలి. కొత్త రాజకీయ సంస్కృతిని నిర్మించగలమా..? ప్రజా సమస్యలపై కలిసి నిలబడగలరా..?భిన్నాభిప్రాయాలతో కలిసి పనిచేయగలరా..? తమ సొంత తప్పులను కూడా విమర్శించుకోగలరా..? రాజకీయ ప్రత్యర్థిని మాత్రమే కాదు, తమ రాజకీయ పద్ధతులను కూడా ప్రశ్నించుకోగలరా..? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికితే కొత్త పార్టీ అయినా, కొత్త ఫ్రంట్ అయినా అర్థవంతమవుతుంది. లేకపోతే కొత్త పేరు వస్తుంది. కొత్త జెండా వస్తుంది. కొత్త వేదిక వస్తుంది. కానీ పాత విభజనల రాజకీయ సంస్కృతి మరో రూపంలో తిరిగి రావచ్చు.కాబట్టి ఇప్పుడు వామపక్ష రాజకీయాలకు కావాల్సింది మరో పేరు కాదు. ప్రజల మధ్య కలిసి పనిచేసే కొత్త రాజకీయ సంస్కృతి. ఐక్యతను ముందుగా ప్రకటించటం కంటే ముందుగా ఆచరణలో నిర్మించాలి. కలిసి నడవాలి. కలిసి పనిచేయాలి. కలిసి నేర్చుకోవాలి. విమర్శలను స్వీకరించాలి. ఆ అనుభవం చెప్పిన రూపంలోనే తరువాత ఐక్యతను నిర్ణయించాలి. అప్పుడు ఐక్యత ఒక నినాదం కాదు. ప్రజల మధ్య పరీక్షించబడిన రాజకీయ అనుభవం అవుతుంది.



దారా
rajenderdamera@gmail.com

## తాండూరు బిగ్ బాష్ లీగ్-13 ప్రారంభించిన పైలెట్ రోహిత్ రెడ్డి

- తాండూరులో స్టేడియం నిర్మాణానికి కృషి



**తాండూరు, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తాండూర్ బిగ్ బాష్ లీగ్-13 క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరులో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని, ముఖ్యంగా తాండూరులో స్టేడియం నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, తాండూరు మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, కౌన్సిలర్ యోగానంద్, నాయకులు వరాల శ్రీనివాస్ రెడ్డి, భీమ్ సింగ్, చెనబసప్ప, హాకీమ్ ఖాన్, ఇంతియాజ్, మధు గౌడ్, చెన్నారెడ్డి, చందర్, అస్ఫాక్, టిఆర్ ఎస్ వి నాయకులు వినోద్, సందీప్, ఆర్గనైజర్లు రియాన్ ఖాన్, ఆదమ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

# వర్షపు నీరు సంరక్షించి భూగర్భ జలాలు పెంచాలి

- విబిజి రాంజీ పనులను పర్యవేక్షించిన కలెక్టర్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** వర్షపు నీరు వృథా కాకుండా భూగర్భ జలాలను పెంపొందించేందుకు విబి జి రామ్ జి కింద చేపట్టే పనులను వెంగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. వికారాబాద్ మండలం గోదుమగూడ గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు విబి జి రామ్ జి కింద చేపట్టిన వివిధ పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ఫామ్ పాండ్స్ , బోర్‌వెల్ రీచార్జ్ పనులు, పైకప్పు నీటి సేకరణ, వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ... వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ విబి జి రామ్ జి కింద పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆయన అధికారులు




సూచించారు. పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, గ్రామపంచాయతీ ఆవరణలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వికారాబాద్ మండలంలో మంజూరైన 72 ఫాం పాండులు, 47 బోర్ వెల్ రీఛార్జ్, 16 పైకప్పు నీటి సేకరణ, 119 వ్యక్తిగత, 33 సామూహిక ఇంకుడు గుంతల పనుల లక్ష్యాలను అధిగమించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో డిఆర్డిఓ శ్రీనివాస్, ఎంపీడీవో వినయ్ కుమార్, సర్పంచ్ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ఇందిర సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### వైద్య కళాశాల గృహంలో వసతులు కల్పించండి

వైద్య కళాశాల వసతి గృహంలో నాణ్యమైన భోజనంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. గురువారం అనంతగిరి గుట్ట వైద్య కళాశాలలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారితో కలిసి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సందర్శించి వివిధ సమస్యలు, సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కనీస మౌలిక వసతులు కల్పనకై కృషి చేస్తానన్నారు. విద్యార్థులతో సంప్రదించి వారికి సౌలభ్యంగా ఉండే విధంగా రెండు కమిటీలను ఏర్పాటుచేసి మెనూను రూపొందించుకొని భోజన సౌకర్యానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మెనూ విషయంలో పర్యవేక్షణ ఉండాలని ఆయన అన్నారు. వసతి గృహం, కిచెన్ షెడ్లకు సంబంధించి గ్రిల్స్, మరమ్మత్తు పనులకు అంచనాలను సమర్పించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ దీన్ దయాల్ బంగ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శుభోదయ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ

- శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్
- ఆదిభట్లలో 24 కమ్యూనిటీ సీసీ కెమెరాల ప్రారంభం
- ఆదిభట్ల పోలీస్ స్టేషన్ తనిఖీ
- రికార్డుల పరిశీలన, పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటిన డీసీపీ

**రంగారెడ్డి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌ను శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ సందేశం ఇచ్చారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా రతన్ టాటా పిజీ కాలేజీ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 24 కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి, సీఐ రమేష్ తో కలిసి ప్రారంభించారు. ప్రజల భద్రత కోసం



సాంకేతికతను వినియోగించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి పెరిగిన నేపథ్యంలో సిబ్బంది, వాహనాల పెంచే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. సీ కేటగిరీలో ఉన్న ఆదిభట్లను ఏ కేటగిరికి పెంచాలని ప్రతిపాదనలు పంపామన్నారు. ఆలయాలు, మసీదుల వద్ద జియో టాకింగ్ విధానం కొనసాగుతుందని తెలిపారు. నేరాలు అదుపునకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్ల పరిధి మారిన నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరాలు అదుపునకు ఇంజనీరింగ్ కళాశాలలో రద్దీ ప్రాంతాల్లో పోలీస్ స్పీకర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రపై సైతం దృష్టి పెట్టినట్లు వివరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు చెప్పారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయా సెక్టర్ల పరిధిలో పని చేస్తున్న ఎస్సైల ఆధ్వర్యంలో నమోదైన వివిధ రకాల కేసుల దర్యాప్తు తీరు తెన్నులు, పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. డీసీపీ పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన సందర్భంగా ఆదిభట్ల సీఐ రమేష్ తమ సిబ్బందితో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేష్, సైదయ్య, సత్యనారాయణ, సుందరయ్య, నోయెల్ రాజ్ , సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోచారంలో ఎన్ఐఆర్‌డీ బృందం పర్యటన

- పథకాల అమలుపై ఆరా
- క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన

**రంగారెడ్డి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోచారం గ్రామంలో ఎన్ఐఆర్‌డీ బృందం పర్యటించింది. ఒడిశా, గుజరాత్, జమ్మూ కశ్మీర్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లతో కూడిన బృందం గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను



క్షేత్రస్థాయిలో పరిశీలించింది. గ్రామంలోని నర్సరీ, గ్రామపంచాయతీ భవనం, స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), పల్లె ప్రకృతి వనం, చెత్త వేరు చేసే షెడ్, ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలను బృంద సభ్యులు సందర్శించారు. గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల పనితీరును అధ్యయనం చేయడంలో భాగంగా ఈ పర్యటన సాగింది. ఆయా అభివృద్ధి పనుల అమలు తీరును పరిశీలించిన బృందం గ్రామంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను సమీక్షించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమీల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ

- జిల్లా ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి
- బతుకమ్మకు ప్రత్యేక పూజలు

**రంగారెడ్డి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ, మానవాళిని ప్రకృతికి మరింత దగ్గర చేసే గొప్ప వేడుకని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల సంయుక్త



ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆమె బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడి సంబరాల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిలో లభించే రకరకాల అందమైన పూలతో బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజించడం ఈ పండుగ ప్రత్యేకతని తెలిపారు. మహిళలకు ఎంతో అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ మన రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశ, విదేశాల్లోనూ గుర్తింపు పొంది తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతోందన్నారు. మహిళలంతా ఒకచోట చేరి తొమ్మిది రోజుల పాటు అత్యంత ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ప్రకృతిని గౌరవిస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి అనిత, వైద్య ఆరోగ్య, మెప్మా, రెవెన్యూ తదితర శాఖల మహిళా అధికారులు, సీడీపీవోలు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగ సాయన్న స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

- మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** మక్తల్ మండలం ముస్లాయిపల్లి గ్రామంలో తెలంగాణ ప్రజావీరుడు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక అయిన పండుగ సాయన్న విగ్రహాన్ని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ



పాలనకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం నేటి యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ధనవంతులు, భూస్వాముల దోపిడీని ఎదిరించి, వారి ఆధిపత్యానికి సవాల్ విసిరిన ధైర్యశాలి సాయన్న అని మంత్రి కొనియాడారు. ఉన్నవారి సంపదను పేదలకు పంచిపెట్టడంతో ప్రజలు ఆయన్ను తెలంగాణ రాబిన్‌హుడ్ గా కొలిచారని తెలిపారు. 19వ శతాబ్దంలో పాలమూరు ప్రాంతంలో సామాజిక అసమానతలు, అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న వీరగాథలు నేటికీ జానపద కళారూపాల్లో సజీవంగా ఉన్నాయని గుర్తుచేశారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం చారిత్రక నిర్ణయమని, ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముదిరాజ్ సామాజిక వర్గం తరఫున మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు బడుగు, బలహీన వర్గాలు ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని, యువత విద్యకు ప్రాధాన్యతనిస్తూ సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలి

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** తెలంగాణ చేనేత ఉత్పత్తులకు రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని, చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




అన్నారు. నాంపల్లిలోని చేనేత భవన్‌లో తెలంగాణ చేనేత అభివృద్ధి కార్పొరేషన్ నూతన కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని మంత్రి సూచించారు. దేవాలయాలు, అధికారిక కార్యక్రమాలు, ఉపాధ్యాయులు, ప్రముఖుల సన్మానాలు, రాజకీయ నాయకుల పరస్పర గౌరవ కార్యక్రమాల్లో సాధారణ సిల్క్ శాలువాలకు బదులుగా చేనేత శాలువాలను వినియోగించాలని పేర్కొన్నారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించేలా అన్ని ప్రభుత్వ శాఖలకు తగిన సూచనలు, మార్గదర్శకాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ముడిసరుకు నుంచి వస్త్రాల తయారీ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వరకు చేనేత రంగంలోని ప్రతి వర్గానికీ ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. చేనేత కార్మికుల ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పించి, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా చూడాలని సూచించారు. చేనేత రంగ అభివృద్ధి ద్వారా కార్మికులకు ఆర్థిక భద్రతతో పాటు సామాజికంగా గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచి రాజకీయ జీవితంలో కష్టపడి పనిచేసిన స్ఫూర్తితో నూతన చైర్మన్ చేనేత రంగ అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పాలనలో చీకట్లో రాష్ట్రం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా కరెంట్ కోతలు
- సాగునీరందక ఎండిపోతున్న పంటలు కాలిపోతున్న మోటార్లు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే విద్యుత్ సంక్షోభం
- రైతులకు తక్షణ పరిహారం అందించాలి

**రంగారెడ్డి, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ కోతలతో తెలంగాణను మళ్ళీ చీకట్లోకి నెడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కరెంట్ కోతలు భయంకరంగా ఉన్నాయని, ఫలితంగా రైతులు, ప్రజలు తీవ్ర అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చే సమయంలో విద్యుత్ సరఫరా సరిగా లేక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో కూడా కరెంట్ కోసం రైతులు పొలాల వద్ద కాపలా కాయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. లో-వోల్టేజ్ సమస్యలతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల



ద్వారా పొలాలకు నీళ్లు పోయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. రైతుల పెట్టుబడులు బూడిదపాలవుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస ముందస్తు ప్రణాళిక గానీ, సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి గానీ లేవని విమర్శించారు. కనీసం వ్యవసాయానికి సరైన విద్యుత్ ఇవ్వలేని ఈ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు.

### ప్రభుత్వ చేతకానితనమే..

విద్యుత్ కోతలకు 'ఎల్ నినో' కారణమని చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. వాతావరణ పరిస్థితులపై ముందే అవగాహన ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ప్రాజెక్టులను నిర్మించి, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7వేల మెగావాట్ల నుంచి 20 వేల మెగావాట్లకు పెంచారని గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా కూడా చేసుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు.

### అధికారులను బలి చేస్తున్నారు..

తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ అధికారులను బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నిరంతరాయంగా విద్యుత్ అందించిన అధికారులే ఇప్పుడు ఉన్నారని, లోపం ప్రభుత్వ నిర్వహణలోనే ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని, పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఎన్‌హెచ్‌ఓఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి




**శంషాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి శంషాబాద్‌లో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, జీవో 60, 1195 ప్రకారం పెరిగిన వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ ఇంక్రిమెంట్లు, లయబిలిటీ బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సంగీత, దినేష్, శంకర్, సాయి కిరణ్, చేతన్, అనూప్, డీహెచ్‌వో డాక్టర్ రాము నాయక్, అమిత్, స్థానిక నాయకులు బత్కు శ్రీనివాస్ యాదవ్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 15 (జనం సాక్షి) :** హనుమకొండలోని జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియం ఆవరణలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ లెవల్ స్కూల్ గేమ్స్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2026ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ క్రీడా ప్రతినిధులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వోత్తమ్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే**



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 15 (జనం సాక్షి) :** మడికొండ లోని సత్యసాయి కన్వెన్షన్'లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి అధ్యక్షులు నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి పార్టీ ప్రతినిధులతో రాబోయే వరంగల్-నల్గొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలపై జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క , రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి కుటుంబ నేపథ్యం కలిగిన, సమర్థుడైన అభ్యర్థి శ్రీ రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అధిష్టానం నిలిపిందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి పట్టభద్ర ఓటరును కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేసి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీ రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు.

# రబీలో ఆరుతడి పంటలు వేయండి

- ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



**ముధోల్, అక్టోబర్ 15(జనం సాక్షి) :** ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో తలెత్తిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా, రైతులు ప్రస్తుత రబీ సీజన్‌లో ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సూచించారు. గురువారం బైంసా పట్టణంలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్" ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందుగా చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ విత్తనాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ముధోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కలిపి ప్రస్తుతం 50% సబ్సిడీపై 9000 బస్తాల శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సంవత్సరం లోటు వర్షపాతం, పెరిగిన ఉష్ణోగ్రతలు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ప్రభుత్వం విద్యుత్ సరఫరాను కూడా తగ్గించే అవకాశం ఉందన్నారు. కాబట్టి రైతులు నష్టపోకుండా ఉండాలంటే వరి వేయకుండా శనగ, సన్ ఫ్లవర్, నువ్వులు తదితర ఆరుతడి పంటలు వేసుకోవడం మంచిదన్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తలెత్తే తాగునీటి ఎద్దడిని నివారించడానికి గ్రామాల్లో సర్పంచ్ లు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల కోరిక మేరకు సన్ ఫ్లవర్ విత్తనాలను కూడా సబ్సిడీపై అందించేలా ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి, బైంసా వ్యవసాయ శాఖ ఏడీఏ, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి




- జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15(జనంసాక్షి):** జిల్లాలో ఎయిడ్స్ వ్యాధి వ్యాపించకుండా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్ ఐ వి అవగాహన బైక్ ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ ఐ వి వ్యాధి వ్యాపించకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. జిల్లాలో 736 మంది హెచ్ ఐ వి బారిన పడ్డారని, వారందరికీ రింగ్స్ ఆసుపత్రి ద్వారా చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా సురక్షిత స్థానంలో ఉందని, ఎయిడ్స్ వ్యాధిపై ఎలాంటి అపోహలు, భయపడవలసిన అవసరం లేదని తెలిపారు. హెచ్ ఐ వి లక్షణాలు ఉన్న వ్యక్తులు క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసుకోవచ్చని తెలిపారు. ఎయిడ్స్ హెల్ప్ లైన్ 1097 ద్వారా మరింత సమాచారాన్ని తెలుసుకోవచ్చని, హెచ్ ఐ వి లక్షణాలు కలిగిన వ్యక్తులు అశ్రద్ధ చేస్తే జీవిత భాగస్వామికి సోకే అవకాశం ఉందని, నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, రాష్ట్ర నియంత్రణ సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# కెరమెరి కుర్రోడి సినీ కల సాకారం

**బుల్లితెరపై మెరుపులు..**

- వివిధ టీవీ సీరియల్స్ లో నటించిన మధు
- పల్లెటూరి యువకుడి నటనా ప్రావీణ్యం
- సొంతంగా 80 వీడియోలు చిత్రీకరణ
- తమధు సినీ సక్సెస్ లైఫ్‌పై జనంసాక్షి ప్రత్యేక కథనం







**కెరమెరి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** మారుమూల గిరి గ్రామం నుంచి వచ్చి బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు ఓ గిరి యువకుడు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం బారేమోడి గ్రామానికి చెందిన నికోడే మధు నటనపై ఉన్న మక్కువతో చిన్నప్పటి నుంచే సినీ రంగంలోకి అడుగుపెట్టాడు.

సోనాజీ, కమలబాయి దంపతులకు ఐదుగురు సంతానం కాగా, నాలుగో కుమారుడు మధు. చిన్ననాటి నుంచి నటన అంటే ఎంతో ఆసక్తి. ఇంటర్ వరకు స్థానికంగా చదువుకున్న అనంతరం నటనలో శిక్షణ తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. 2017లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నాట్యమండలిలో నటనలో శిక్షణ పూర్తి చేశాడు. అనంతరం చిన్న చిన్న పాత్రల్లో నటిస్తూ తన ప్రతిభను నిరూపించుకున్నాడు.

**నటించిన సీరియల్స్**

2017లో 'అమ్మనా కోడలు' సీరియల్ ద్వారా బుల్లితెరకు పరిచయమైన మధుకు ఆ తర్వాత వరుస అవకాశాలు వచ్చాయి. నిన్నే పెళ్లాడతా (2018), అత్తారింట్లో అక్కాచెల్లెలు (2019), గువ్వా గోరింక (2019), సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (2020), మౌన పోరాటం (2022), అమ్మాయిగారు (2024) వంటి పలు సూపర్ హిట్ సీరియల్స్ లో నటించి ప్రేక్షకులను మెప్పించాడు. ప్రస్తుతం 'ఆరో ప్రాణం' సీరియల్ లో నటిస్తున్నాడు.

**నటించిన సినిమాలు**

బుల్లితెరపైనే కాకుండా వెండితెరపై కూడా తన సత్తా చాటుతున్నాడు. నక్షత్రం, రాజుగారి అమ్మాయి నాయుడు గారి అబ్బాయి, మస్తు షేడ్ అమ్మాయిగా, ఉత్తమ విలన్, మేక సూరి వంటి సినిమాల్లో చిన్న పాత్రల్లో నటించాడు. ప్రస్తుతం 'విభూ' అనే సినిమాలో నటిస్తున్నాడు.

సినిమా, సీరియల్ అనే తేడా లేకుండా మంచి నటుడిగా ఎదగడమే తన లక్ష్యమని మధు చెబుతున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న యువతీ యువకులు చాలా మంది ఉన్నారని, వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే తప్పకుండా విజయం సాధించవచ్చని అంటున్నాడు.

**ఆనందంగా ఉంది..**



నాకు నటన అంటే ప్రాణం. చిన్నప్పటి నుంచి యాక్టర్ కావాలని ఉండేది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారు ఇచ్చిన శిక్షణతో అవకాశాలు వచ్చాయి. అందుకు ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటా. నాకు ఇష్టమైన రంగంలో స్థిరపడినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంలో సినీహీరో రవితేజను కలిసినప్పుడు ఆయన నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

**మధు నికోడే, ఆర్టిస్ట్.**

# యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

- టాస్క్ కేంద్రంలో ఈ నెల 31 వరకు పేర్ల నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 15(జనంసాక్షి) :** జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రం లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిటైల్ రంగంతో పాటు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలను పొందేందుకు ఉద్దేశించిన రెండు వేర్వేరు శిక్షణ కార్యక్రమాలకు అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 31వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ల్యాండ్‌మార్క్ గ్రూప్ ఫౌండేషన్ సహకారంతో హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ అమలు చేస్తున్న 'మేక్ ఇండియా కేపబుల్' కార్యక్రమంలో భాగంగా యువతకు ఉచిత ఉద్యోగ సన్నద్ధత శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ శిక్షణలో 30 రోజుల పాటు తరగతి గదిలో బోధన, ఆచరణాత్మక అభ్యాసం ఉంటాయని తెలిపారు. అనంతరం ఏడు రోజుల పాటు పని ప్రదేశంలో ప్రత్యక్ష శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రిటైల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సహకారం అందించనున్నట్లు వివరించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలోని టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రం, ఎక్సెల్‌ఆర్ సంస్థ సహకారంతో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలకు అనుసంధానంగా మరో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 45 రోజుల పాటు తరగతి గదిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. సంబంధిత రంగాల ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అభ్యర్థులకు నేర్పించి, ఉపాధి అవకాశాలు పొందేందుకు తోడ్పాటు అందించనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు ములుగులోని బండారుపల్లి రోడ్డులో ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించి, తాము చేరదలచిన శిక్షణ కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రెండు కార్యక్రమాలకు పేర్ల నమోదుకు చివరి తేదీ 31.10.2026 అని స్పష్టం చేశారు. శిక్షణ తరగతుల ప్రారంభ తేదీలు, ప్రవేశ ప్రక్రియ, ఇతర పూర్తి వివరాల కోసం టాస్క్ సెంటర్ కోఆర్డినేటర్ మురళి కృష్ణ 9490500282, 9618449360 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు ఈ శిక్షణ కార్యక్రమాల వివరాలను అర్హులైన యువతకు తెలియజేసి, గడువులోగా పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

# టర్కీలో ప్రమాదానికి గురైన యువకుడిని రప్పించాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** టర్కీలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల్ జిల్లా సోన్ మండలం మాధ్‌పూర్‌కు చెందిన తోకల ఆదిత్యను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు. ఉపాధి కోసం టర్కీ వెళ్లిన ఆదిత్య అంకారాలోని అక్యుర్ట్‌లో ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా భవనం మొదటి అంతస్తు నుంచి కిందపడి గాయపడ్డాడు. ప్రస్తుతం అంకారాలోని ఎట్లిక్ సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (ఎన్ఆర్ఐ విభాగం) విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించింది. అవసరమైన వైద్య సహాయం అందించి సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చేలా చర్యలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యం..

- కాంగ్రెస్ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**కాజీపేట, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** రాబోయే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా హనుమకొండ జిల్లా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క), కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాబోయే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగస్తులు, పట్టభద్రులు, నిరుద్యోగ యువతతో పాటు విద్యావంతులందరినీ కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను తెలుసుకుంటూ, వారితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పార్టీ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పట్టభద్రుల సమస్యలు, యువత ఆకాంక్షలు, ఉద్యోగుల అభిప్రాయాలను గౌరవిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా అందరినీ భాగస్వాములను చేసుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తూ పట్టభద్రులతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమష్టి కృషి చేయాలి. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగస్తులు, పట్టభద్రులు, యువతను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల సన్నాహాలను పటిష్టంగా నిర్వహించాలని అయూబ్ కోరారు. అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు, ఓటరు జాబితాలో వివరాల పరిశీలన, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ, పార్టీ నాయకత్వం నిర్దేశించిన కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

# 81 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపు సీజ్



**కడెం, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** అక్రమంగా తరలించి ఉన్న ఇసుక డంపులపై రెవెన్యూ శాఖ మరోసారి ఉక్కు పాదం మోపింది. కడెం మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామ సమీపాన గోదావరి నదిని ఆనుకొని ఉన్న దాదాపు 35 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసి వేలంపాట వేసిన విషయం తెలిసిందే. అది పూర్తిగా 24 గంటలు మూగీకముందే మరోసారి అదే గ్రామంలోని పంట పొలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు 81 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గురువారం రెవెన్యూ అధికారులు ఆర్ ఐ శారద సీజ్ చేసినట్లు తెలిపారు. అధికారులకు అందిన పక్కా సమాచారం మేరకు మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామ సమీపాన పంట పొలాల్లో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలించి పోసి నిల్వ ఉంచిన రెండు డంపులను తహసిల్దార్ కాజా మొహీనుద్దీన్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు మొదటిది 75 ట్రాక్టర్ల ట్రిప్పులు, రెండవది 6 ట్రాక్టర్ల ట్రిపుల్ గా గుర్తించి అట్టి డంపులకు రెవిన్యూ అధికారులు ముగ్గు పోసి సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు.

# పోలీసు కార్యాలయ ఆవరణాలను పరిశుభ్రంగా ఉంచాలి

- కాళేశ్వరం మల్టీజోన్ 1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా
- జిల్లా పోలీస్ కార్యాలయంలో పరిశీలన



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15(జనంసాక్షి) :** పోలీసు కార్యాలయ ఆవరణాలను పరిశుభ్రంగా ఉంచాలని కాళేశ్వరం మల్టీజోన్ 1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని కాళేశ్వరం మల్టీజోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ పుష్పగుచ్ఛం అందించి డీఐజీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యాలయ ఆవరణను పరిశీలించి, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా,పచ్చదనంతో, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసిఅర్‌బీ) కార్యాలయాన్ని తనిఖీ చేసి,నేరాల రికార్డులు, కేసులవివరాలు,నేరస్థుల డేటా,పెండింగ్ కేసులకు సంబంధించిన రికార్డులు,రిజిస్టర్లు, ఫైళ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఏ, బీ సెక్షన్లు, ఫింగర్‌ప్రింట్,డీ 4సి , కమాండ్ కంట్రోల్ విభాగాలను తనిఖీ చేసి,ఆయా విభాగాల్లో నిర్వహిస్తున్న రికార్డులు,రిజిస్టర్లు, ఫైళ్లు,సిబ్బంది విధుల నిర్వహణ, కార్యాలయ పనితీరును పరిశీలించారు. రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు నవీకరించి భద్రపరచాలని అధికారులకు సూచించారు. పోలీస్ శాఖ సమర్థవంతమైన పనితీరుకు ఖచ్చితమైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకం అని డీఐజీ పేర్కొన్నారు. కేసులు,నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేసి, అవసరమైనప్పుడు తక్షణమే అందుబాటులో ఉండేలా డేటాను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ డేటా నిర్వహణ, రికార్డుల నవీకరణలో నాణ్యత, ఖచ్చితత్వాన్ని పాటించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పరిశుభ్రత, క్రమశిక్షణ, ఫైళ్లు, రికార్డుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, సిబ్బంది తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని డీఐజీ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కార్యాలయ విభాగాల పనితీరును సమీక్షించి, పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఉచిత పోలీస్ నియామక శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 160 మంది అభ్యర్థులతో డీఐజీ శ్రీ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్ మాట్లాడి,వారి శిక్షణ,సన్నద్ధతకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని,పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ,ఏఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్),డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# జయమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో పేట ప్రాంతం సస్యశ్యామలం

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** మక్తల్-నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భాగంగా నారాయణపేట మండలం పెరపల్లి గ్రామంలోని జయమ్మ చెరువులో జయమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులకు గురువారం నారాయణపేట జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం. శివకుమార్ రెడ్డి, జిల్లా ఆడిషనల్ కలెక్టర్ శ్రీను, ఇరిగేషన్ శాఖ ఎస్. ఈ సత్యనారాయణ లు రైతులతో కలసి భూమి పూజ కార్యక్రమం నిర్వహిం చారు.అనంతరం గ్రామ సర్పంచ్ ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభ లో రైతులను ఉద్దేశించి మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడు తూ, జయమ్మ రిజర్వా యర్ ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమని, ఎన్నో ఏళ్ల పోరాటం, రైతుల త్యాగాల ఫలితంగా ఈ రోజు నిర్మాణ పనులు ప్రారంభమవుతున్నాయని అన్నారు.



### నాలుగు దశాబ్దాల పోరాటానికి ఫలితం

జయమ్మ చెరువు ను రిజర్వాయర్ గా మార్చాడానికి కోసం ఎన్నో కష్టాలు, అవమానాలు, ఆటంకాలను ఎదుర్కొంటూ పోరాటం సాగించామని కుంభం శివకుమార్ రెడ్డి తెలిపారు.ఆరోజు అధికారంలో ఉన్న కొందరు అవగాహన లేకుండా జయమ్మ చెరువు గురించి మాట్లాడారని,అభివృద్ధి చేయడం చేతకాక, రాజకీయాలు చేశారని ఆరోజే ఒక్క అవకాశం వస్తే ఈ ప్రాంతానికి సాగునీరు తీసుకొచ్చి ఎలా అభివృద్ధి చేయాలో చేసి చూపిస్తామని ఆరోజు చెప్పిన మాట ప్రకారం ఈరోజు ప్రాజెక్టు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామన్నారు.రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా పట్టించుకోకుండా ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.పేర్కొన్నారు. దివంగత నార్సిరెడ్డి గారి ఆశయ సాధనకు ఈ ప్రాజెక్టును అంకితం చేస్తున్నానని భావోద్వేగంతో ప్రకటించారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

మక్తల్-నారాయణపేట-కొడంగల్ సాగునీటి ప్రాజెక్టు మంజూరు లో మరియు వేగవంతంగా నిర్మాణ పనులు ముందుకు సాగేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం అందించారని పేర్కొంటూ, ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు, నిర్వాసిత రైతులకు ఎకరాకు 20 లక్షల పరిహారం పెంపు వంటి అంశాలను ప్రస్తావించారు.ఈ ప్రాంత ప్రజల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఆటంకాలు ఎదురైనా వాటిని అధిగమించి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన రైతుల త్యాగాలను గౌరవిస్తాం రిజర్వాయర్ కోసం భూములు అందించిన రైతుల త్యాగాలను మరువమని, వారిని గౌరవిస్తామని కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు.ప్రతి రైతుకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు. రైతుల భూముల్లో ఉన్న బావులు,బోర్లు, చెట్లు, షెడ్లు తదితర ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,అర్హత కలిగిన ప్రతి ఒక్కటి నమోదు చేయాలని అధికారులను కోరారు. పరిహారం విషయంలో ఏ రైతుకూ అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు.భూములు కోల్పోయిన కుటుంబాలు తమ జీవనాధారాన్ని కోల్పోయి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రైతులు తనపై,ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం.పర్ణిక రెడ్డి పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటమని ఈ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం విద్యా, వైద్య రంగాలకు వందల కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని,తమ చివరి శ్వాస వరకు ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం కట్టుబడి పని చేస్తామని హామీ ఇచ్చారు.

### రైతుల సహకారంతో ప్రాజెక్టు విజయవంతం కావాలి

ప్రాజెక్టు నిర్మాణానికి భూములు అందించిన రైతులకు, గ్రామ సర్పంచ్ అంజనేయులుకు, ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కుంభం శివకుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జయమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయి, నారాయణపేట ప్రాంతం సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీలకు 10 లక్షలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి



**మల్దకల్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మండలం పరిధిలోని మద్దెలబండ పెద్ద తండాలో 55 మంది మహిళా కూలీలతో ఘనంగా నిర్వహించారు.జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ జి. నర్సింలు,టీ.పద్మ,జిల్లా మహిళా కోఆర్డినేటర్,యం. వినోద జిల్లా యూత్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో సీసీ కెమెరాలు ఉన్న వీధిలైట్లు ఉన్న ఆరు సంవత్సరాల పసిపాప నుండి 60 సంవత్సరాల వృద్యాప మహిళల వయసు వరకు ఎన్ని చట్టాలు వచ్చినా మహిళల పైన రోజు ఎక్కడో ఒకచోట మహిళల పైన అత్యాచారాలు మానభంగాలు చంపడాలు జరుగుతున్నాయి. రోజురోజుకు మాదకద్రవ్యాలు మద్యపానీయాలు సేవించి చదువుకునే వారి నుండి చదువు లేని వారి వరకు చిన్న వయసు నుండి పెద్ద వయసు కలిగిన పురుషులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి మహిళల పైన దాడులు చేయడానికి పూనుకుంటున్నారు. పనికి తగ్గ వేతనాలు 920 రూపాయలు ఒక్క రోజుకు స్త్రీ పురుషులకు సమానం వేతనాలు ఇవ్వాలి,ప్రతి గ్రామీణ మహిళలందరూ అక్షర శాతం పెంచుకోవాలి, భూమిలేని నిరుపేద కూలి కుటుంబాలకు ప్రభుత్వము ఒక కుటుంబానికి 5 ఎకరాల భూమి ఇవ్వాలి. కూలి పనికి వెళుతున్న మార్గమధ్యలో ప్రమాదవశత్తు ప్రమాదం సంభవించిన బీమా సౌకర్యం కింద పది లక్షలు బీమా సౌకర్యం కల్పించాలి ప్రభుత్వంవి బి జి రామ్ జి చట్టంలో ఒక వ్యక్తికి 200 రోజులు పని కల్పించే విధంగా 200 రోజుల జాబ్ కార్డు ఇచ్చి వేతనాలు వారం రోజులు లోపే వారి అకౌంట్లో నమోదు కావాలి కోరారు.

## అంతరాష్ట్ర నిందితుడి అరెస్ట్

- మొబైల్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు.. ఆరు స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం
- తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యం
- రూ.80 వేల విలువైన ఫోన్లు రికవరీ



**హుజూర్ నగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** హుజూర్ నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండల కేంద్రంలోని మొబైల్ దుకాణంలో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర నిందితుడిని మఠంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.80 వేల విలువైన ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజ్జె. చరమంద రాజు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యం.. గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన చక్రవర్తి అలియాస్ బాబు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, చైతన్యపురి పరిధిలో ఒకటి, కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చోరీ కేసులు నమోదయ్యాయి. 2023లో కోదాడ టౌన్ పరిధిలోని మూడు కేసుల్లో అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు సిఐ తెలిపారు. ఇటీవల మఠంపల్లిలోని ఓ మొబైల్ దుకాణంలో నిందితుడు చోరీకి పాల్పడ్డాడు. దొంగిలించిన సెల్ ఫోన్ లను ఇతరులకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్ లో వినియోగించిన కొత్త సిమ్ కార్డులు, కాల్ డేటా రికార్డులను విశ్లేషించి నిందితుడి ఆచూకీని గుర్తించారు. మరోసారి నేరానికి పాల్పడేందుకు నిందితుడు మఠంపల్లికి వచ్చినట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చరమంద రాజు వెల్లడించారు. ఈ కేసు ఛేదనలో మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకటయ్యను విధుల్లోకి తీసుకున్న ఎంపీఓ, పంచాయతీ సెక్రటరీ

- జనం సాక్షి కథనానికి స్పందన
- జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- వేధింపులకు పాల్పడిన అధికారులపై చర్యలు.. మెమోల జారీ!
- జనం సాక్షి యాజమాన్యానికి, విలేకరికి
- కృతజ్ఞతలు తెలిపిన వెంకటయ్య కుటుంబ సభ్యులు

**మాద్గులపల్లి, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** గజలాపురం గ్రామ పంచాయతీలో బహుళార్థ సాధక కార్మికుడిగా పనిచేస్తున్న కుక్కముడి వెంకటయ్యపై జరుగుతున్న వేధింపుల ఉదంతంపై జనం సాక్షి లో ప్రచురితమైన వరుస కథనాలకు జిల్లా యంత్రాంగం స్పందించింది అక్రమంగా విధులకు దూరం చేసిన వెంకటయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) మాడ్గులపల్లి ఎంపీఓను ఆదేశించారు డీపీఓ ఆదేశాల మేరకు స్పందించిన ఎంపీఓ మరియు పంచాయతీ సెక్రటరీ తక్షణమే వెంకటయ్యను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. గత 2019 నుండి పంచాయతీలో సేవలందిస్తున్న తనను విధులకు రాకుండా అడ్డుకుంటూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ వెంకటయ్య అధికారులకు ఫిర్యాదు చేయడం, ఈ అంశంపై జనం సాక్షి పత్రికలో వార్తలు వెలువడటం తెలిసిందే ఈ క్రమంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన అధికారులు, వెంకటయ్య సమర్పించిన నియామక పత్రాలు, బ్యాంకు ద్వారా పొందిన వేతన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

### చిల్లస్థాయి అధికారులపై చర్యలు మెమోల జారీ

బాధితుడి ఆవేదనలో వాస్తవం ఉందని గ్రహించిన ఉన్నతాధికారులు, ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, కార్మికుడిని వేధింపులకు గురిచేసిన చిల్లస్థాయి అధికారులపై కూడా కఠిన చర్యలు చేపట్టారు వారికి వివరణ కోరుతూ మెమోలు జారీ చేయడం విశేషం అనంతరం వెంకటయ్య కుటుంబ జీవనాధారాన్ని పరిగణనలోకి తీసుకుని తక్షణమే ఆయనను తిరిగి విధుల్లోకి చేర్చుకున్నారు



### జనం సాక్షి యాజమాన్యానికి, విలేకరికి కృతజ్ఞతలు

తనపై జరుగుతున్న అన్యాయాన్ని వెలికితీసి, డీపీఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా నిరంతరం వార్తలు ప్రచురించిన జనం సాక్షి పత్రిక కీలక పాత్ర పోషించిందని వెంకటయ్య కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు తమకు న్యాయం జరిగేలా సహకరించి, జీవనాధారమైన ఉపాధిని పునరుద్ధరించేలా అండగా నిలిచిన జనం సాక్షి యాజమాన్యానికి, విలేకరికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పేదలకు భరోసాగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు



**బీబీనగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు భరోసాగా నిలుస్తున్నాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు బీబీనగర్ పట్టణంలోని ఫేమస్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీబీనగర్ పట్టణం, మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ఆహార భద్రతకు భరోసా కల్పించడంతో పాటు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డుల ద్వారా అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అదేవిధంగా, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందించడం ద్వారా వారి సొంతింటి కల సాకారమయ్యేందుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పని చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ పొట్టోల్ల శ్యామ్ గౌడ్, వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పంజాల శ్రీనివాస్, తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పంజాల రామాంజనేయులు, గోలి పింగల్ రెడ్డి జిల్లా నాయకులు గడ్డం బాల్ రెడ్డి, గోలి నరేందర్ రెడ్డి ఆగమయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి

- మార్కెట్ చైర్మన్ చలసాని స్పందన రాజీవ్

**నేరేడుచర్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఈ ప్రాంత రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని నేరేడుచర్ల మార్కెట్ చైర్పర్సన్ చలసాని స్పందన రాజీవ్ అన్నారు.నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్మన్‌గా, చలసాని స్పందన రాజీవ్,వైస్ చైర్మన్ గా మునుగాల భాస్కర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. వారితోపాటు పాలకవర్గ సభ్యులు కర్ణం రామనరసయ్య, బుర్రి వెంకయ్య, సూరోజు రవీంద్రాచారి, ఊటుకూరు సైదులు, పల్లె కాశయ్య, కత్తి శ్రీనివాసరెడ్డి, ధనావత్ సైదులు, రమావత్ వశ్య నాయక్, చింతలచెరువు ప్రియాంక, పోతురాజు జ్యోతి, రెబ్బ రమేష్, పోలా విశ్వనాథంలతో మార్కెట్ కార్యదర్శి సన్నీ గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించి, పదవీ బాధ్యతలు అప్పగించారు.

అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మున్సిపల్ ఛైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నూతన చైర్మన్ స్పందన రాజీవ్ మాట్లాడుతూ.. ప్రజలకు, రైతులకు సేవ చేయాలనే సంకల్పంతో అమెరికాలో చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చి మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు.పదవులు తమ కుటుంబానికి కొత్త కాదని, తన అత్తమామలు, భర్తకు రాజకీయ నేపథ్యం ఉందని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి వారు ఎనలేని సేవ చేశారని గుర్తుచేశారు. 34 ఏళ్ల పిన్న వయసులో తనకు మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, ఇందుకు సహకరించిన నేరేడుచర్ల, పాలకవీడు ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షుడు దొంగల వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు చలసాని శ్రీనివాస్ రావు, సీనియర్ నాయకులు సాముల శివరెడ్డి,హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్,హుజూర్ నగర్ మార్కెట్ చైర్మన్ అరుణ్ కుమార్ దేశ్ ముఖ్, నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి,పాలక వీడు మాజీ జెడ్పీటీసీ మోతీలాల్,మాజీ ఎంపీపీ గోపాల్ నాయక్ ,పాలక వీడు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు,మాజీ మార్కెట్ చైర్మన్ బెల్లంకొండ విజయ లక్ష్మీ నరసింహ రావు, గరిడేపల్లి మాజీ ఎంపీపీ పెండెం శ్రీనివాస్,మాజీ వైస్ చైర్మన్ తాళ్ళ సురేష్ రెడ్డి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రహీముద్దీన్, నిమా నాయక్, మున్సిపల్ కౌన్సిలర్స్, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట

**కాప్రా, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పలు కాలనీల్లో మూడు కోట్ల 82 లక్షలు వేయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి గ్రామం రూ. 45 లక్షలు, వీఆర్ కాలనీ రూ. 26 లక్షలు,మింట్ కాలనీ, రెడ్డి కాలనీ రూ. 22 లక్షలు, బి.ఎన్. రెడ్డి నగర్ - రూ. 46 లక్షలు, ఈసీ నగర్ - రూ. 49 లక్షలు,డాక్టర్స్ కాలనీ, నేతాజీ నగర్ - రూ. 49 లక్షల, బి.ఎన్. రెడ్డి నగర్ ఫేజ్-2 - రూ. 49 లక్షలు, బి.ఎన్. రెడ్డి నగర్ ఫేజ్-1 రూ. 49.70 లక్షలు, రైల్ విహార్ కాలనీ పైపులైన్ నిర్మాణం మొత్తం మూడు కోట్ల 82 లక్షల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీ, మురుగునీటి పారుదల వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తయితే ఆయా కాలనీల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలతో పాటు మురుగునీటి పారుదల సమస్యల పరిష్కారానికి దోహదపడతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు శివకుమార్ గౌడ్, మహేష్ గౌడు తదితరులు పాల్గొన్నారు.



## వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

**చింతపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు వరి పంటకు బదులుగా వేరుశనగ, మినుములు, పెసర, జొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చింతపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని, వ్యవసాయ రంగ అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. ఏటీఎంఏ చైర్మన్ అంగిరేకుల నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన పంటలు సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి, ఎఫ్‌పీఓ సీఈఓ మల్లేష్, ఏఈఓలు మౌనిక, అనంతలక్ష్మి, శ్రీలత, ఆంజనేయులు, దొంతం అలివేలు సంజీవరెడ్డి, జటావత్ హరినాయక్, గ్రామ సర్పంచ్ కాసారపు శ్వేత శ్రీనివాస్,కొండూరి పవన్ కుమార్, ముచ్చర్ల గిరి, ఎరుకల వెంకటయ్య గౌడ్, దాసరి శ్రీనివాస్ యాదవ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండలంలోని పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా శానిటేషన్ పై పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతూ తడి చెత్త - పొడి చెత్త వేరు చేసి ప్రజలు అందించే విధంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్స్ ప్రజా జీవనంలో ప్రజలతో భాగస్వామ్యం కావాలి నగరాభివృద్ధి పనులలో వేగం పెంచాలి. పరిసర పరిశుభ్రతకు నిలయాలుగా మున్సిపాలిటీలు తయారు కావాలని అదనపు కలెక్టర్ నగేష్ మున్సిపల్ కమిషనర్లు ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల మున్సిపల్ మున్సిపల్ కమిషనర్స్ మున్సిపల్ సిబ్బందితో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు ప్రగతి పథంలో నడవాలంటే కమిషనర్స్ ప్రణాళిక బద్ధంగా మున్సిపల్ సిబ్బంది సమగ్ర కార్య చరణతో ముందుకు నడుపుతూ శానిటేషన్ లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ మన మన పట్టణం, మన ఇల్లు మన పరిసరాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసే విషయంలో లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు పోవాలన్నారు నగరాభివృద్ధి పథకంలో భాగంగా ఎస్డిఎఫ్ , అమృత్, స్వచ్ఛభారత్ మిషన్ మున్సిపల్ పెండింగ్ పనులు వేగం పెంచాలని,100 శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మెదక్, నర్సాపూర్ రామాయంపేట తూప్రాన్ మున్సిపల్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేసి, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను 4 రకాలు గా వేరు చేయాలని ,త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని, వీది దీపాలు క్రమం తప్పకుండా వెలగాలని, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, రామాయంపేట తూప్రాన్ నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పచ్చ బంగారానికి ధరల జోరు

## నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు, సోయాకు మంచి ధరలు

- రైతుకు భరోసా ఎప్పుడో..?
- రాబడి తగ్గితేనే రేట్ల పెరుగుదలా?
- పంట చేతికొచ్చినప్పుడు ధరల పతనం
- నిల్వ సౌకర్యాలు, గిట్టుబాటు ధరల స్థిరీకరణపై అన్నదాతల ఆశలు

**పంట పండించడం ఒక ఎత్తయితే.. దానికి గిట్టుబాటు ధర సాధించడం మరో ఎత్తుగా మారింది. నెలల తరబడి శ్రమించి, పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేసిన రైతుకు మార్కెట్‌లో మంచి ధర లభించినప్పుడే ఆ కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. ప్రస్తుతం నిజామాబాద్ శ్రద్ధానంద్ గంజ్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు, సోయాబీన్ ధరలు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. పసుపు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.23,739 ధర పలకగా, సోయాబీన్ గరిష్ఠ ధర రూ.7,061కు చేరింది. అయితే ఈ ధరల జోరు రైతుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతుందా? లేక మార్కెట్‌కు సరుకు తక్కువగా వచ్చిన ప్పుడే కనిపించే తాత్కాలిక ఊరటగా మిగిలిపోతుందా? అన్న ప్రశ్నలు అన్నదాతలను వెంటాడుతున్నాయి.**





**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి):** పసుపునకు రూ.23,739 మార్కెట్‌లో సందడి నిజామాబాద్ జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా గుర్తింపు పొందిన పసుపునకు బుధవారం మార్కెట్‌లో మంచి ధరలు నమోదయ్యాయి. శ్రద్ధానంద్ గంజ్ మార్కెట్‌లో క్వింటాల్ పసుపు గరిష్ఠంగా రూ.23,739 పలకగా, మధ్యస్థ ధర రూ.21,320, కనిష్ఠ ధర రూ.17,720గా నమోదైంది. బుధవారం మార్కెట్‌కు 689 క్వింటాళ్ల పసుపు రాగా, కొనుగోళ్లు జరిగాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో పంటను విక్రయించేందుకు వచ్చిన రైతుల్లో కొంతమేర సంతృప్తి కనిపిస్తోంది. సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిన నేపథ్యంలో పసుపునకు లభిస్తున్న ధరలు తమకు ఆర్థికంగా ఊరటనిస్తాయని రైతులు ఆశిస్తున్నారు.

**సరుకు తగ్గితేనే ధర పెరుగుతుందా?**

మార్కెట్‌లో పసుపు ధరలు పెరగడానికి సరుకు రాక తగ్గడం కూడా ఒక కారణమై ఉండవచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మార్కెట్‌కు వచ్చే పంట పరిమాణం, కొనుగోలుదారుల డిమాండ్, నాణ్యత, నిల్వల్లో ఉన్న సరుకు వంటి అంశాలు ధరలపై ప్రభావం చూపుతాయి. సరుకు పరిమితంగా ఉండి కొనుగోలు పోటీ పెరిగితే ధరలు పైకి వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే ఇదే పరిస్థితి కొత్త పంట మార్కెట్‌లోకి పెద్ద మొత్తంలో వచ్చినప్పుడు కొనసాగుతుందా? అన్నది కీలకంగా మారింది. సరుకు రాక పెరిగినప్పుడు ధరలు తగ్గితే ప్రస్తుతం కనిపిస్తున్న లాభదాయక పరిస్థితి రైతు లకు ఎంతకాలం ఉపయోగపడుతుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రతి ఏడాది పంట చేతికొచ్చే సమయంలో ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, కొంతకాలం తర్వాత సరుకు తగ్గినప్పుడు ధరలు పెరగడం వంటి పరిణామాలు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను వెంటనే అమ్మాల్సిన ఆర్థిక అవసరాలు ఉన్న రైతులు ధరలు పెరిగే వరకు వేచి చూసే పరిస్థితి కూడా ఉండటం లేదు.

**సోయాబీన్‌కూ ఊరట, కానీ నిలకడే ముఖ్యం**

పసుపుతో పాటు మరో ప్రధాన వాణిజ్య పంట సోయాబీన్‌కు కూడా నిజామాబాద్ మార్కెట్‌లో ఆశాజనక ధరలు నమోదయ్యాయి. బుధవారం క్వింటాల్ సోయా బీన్ గరిష్ఠంగా రూ.7,061 పలకగా, కనిష్ఠ ధర రూ.5,711గా నమోదైంది. మార్కెట్‌కు మొత్తం 679 క్వింటాళ్ల సోయాబీన్ వచ్చింది.రెండు ప్రధాన పంటలకు ధరలు మెరుగ్గా ఉండటం రైతుల్లో ఆశలు పెంచుతోంది. అయితే గరిష్ఠ ధర అందరికీ ఒకే విధంగా లభించకపోవచ్చనే విషయాన్ని కూడా రైతులు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పంట నాణ్యత, తేమ శాతం, సరుకు పరిస్థితి, కొనుగోలుదారుల డిమాండ్‌ను బట్టి ధరల్లో వ్యత్యాసాలు ఉండవచ్చు.ప్రస్తుత ధరలతో కొంతమంది రైతులకు మెరుగైన ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, మొత్తం పంటను విక్రయించే సమయానికి ఇదే స్థాయి ధరలు ఉంటాయనే హామీ లేదు. అందుకే రైతులకు కావాల్సింది ఒక్కరోజు రికార్డు ధరలు మాత్రమే కాదు.. పంట మార్కెట్‌లోకి వచ్చినప్పటి నుంచి విక్రయాలు పూర్తయ్యే వరకు ఆదాయంపై భరోసా కల్పించే ధరల విధానం.

**నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంటే మేలు**

పంటను పండించిన వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి నుంచి రైతులు బయటపడాలంటే శాస్త్రీయ నిల్వ సౌకర్యాలు, అవసరమైన గిడ్డంగులు, గిడ్డంగి రశీదుల ఆధారంగా రుణ సదుపాయాలు అందుబాటులో ఉండాలని వ్యవసాయ రంగ నిపుణులు సూచిస్తున్నారు. నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటే మార్కెట్‌లో ధరలు అనుకూలంగా లేని సమయంలో రైతులు కొంతకాలం వేచి చూసే అవకాశం ఉంటుంది.అయితే పంటను నిల్వ చేయడం మాత్రమే పరిష్కారం కాదు. నిల్వ ఖర్చులు, పంట నాణ్యత దెబ్బతినే ప్రమాదం, రుణాలపై వడ్డీ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. చిన్న, సన్నకారు రైతులకు ఈ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం మరింత అవసరం.అదే సమయంలో మార్కెట్ ధరలపై పారదర్శక సమాచారం, కొనుగోలు కేంద్రాల సమర్థ నిర్వహణ, పంటల వారీగా ధరల ధోర ణులపై ముందస్తు అవగాహన రైతులకు ఉపయో గపడతాయి.

**రికార్డు ధరలకంటే రైతుకు కావాల్సింది భరోసా**

నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు, సోయాబీన్ ధరలు పెరగడం సానుకూల పరిణామమే. కానీ ఒకరోజు నమోదైన గరిష్ఠ ధరతోనే రైతుల ఆర్థిక పరిస్థితి పూర్తిగా మెరుగుపడిందని చెప్పలేం. ధరల స్థిరత్వం, సాగు ఖర్చుల నియంత్రణ, మార్కెట్ సదుపాయాలు, సమర్థవంతమైన ప్రభుత్వ జోక్యం కలిసివచ్చినప్పుడే రైతుకు నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. పంట పండించినప్పుడు ధర పడిపోకుండా ధర పెరిగినప్పుడు ఆ ప్రయోజనం రైతుకే దక్కేలా వ్యవస్థ ఉండాలి.అప్పుడే పచ్చ బంగారం రైతు ఇంట సిరులు కురిపిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో వినిపిస్తున్న ధరల మోత రైతుల జీవితాల్లోనూ శాశ్వత ఆనందాన్ని నింపుతుందా? అన్నది రానున్న రోజుల్లో మార్కెట్ ధరల సరళి, ప్రభుత్వ చర్యలపై ఆధారపడి ఉంటుంది.

**గిట్టుబాటు ధరల స్థిరీకరణపై ఆశలు**

ప్రస్తుత మార్కెట్ ధరలు రైతులకు ఊరటనిస్తున్నా, వ్యవసాయ రంగంలో దీర్ఘకాలిక సమస్య మాత్రం అలాగే ఉంది. పెట్టుబడులు ఏటేటా పెరుగుతున్నా, పంట విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం మార్కెట్ పరిస్థితులపై ఆధారపడుతోంది. ధరలు బాగున్నప్పుడు లాభాలు కనిపించినా, ధరలు పడిపోయినప్పుడు అప్పులు తీర్చడం, కుటుంబ ఖర్చులు నిర్వహించడం, తదుపరి పంటకు పెట్టుబడి సమకూర్చడం కష్టమవుతోంది. పసుపు, సోయాబీన్ వంటి వాణిజ్య పంటలకు మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన కొనుగోలు వ్యవస్థలు, నిల్వ సదుపాయాలు, ధరల పతనం సమయంలో రైతులకు రక్షణ కల్పించే చర్యలు అవసరమని అన్నదాతలు కోరుతున్నారు. మద్దతు ధరలు ప్రకటించడంతో పాటు, అర్హులైన రైతులకు ఆ ధరలు వాస్తవంగా అందేలా కొనుగోలు వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## మున్సిపల్ కార్మికున్ని కొట్టిన కౌన్సిలర్ పై కేసు నమోదు

### మున్సిపల్ ఆఫీస్ ముందు కార్మికులు ధర్నా

కామారెడ్డి అక్టోబర్ 15 (జనంసాక్షి):కామారెడ్డి జిల్లా మున్సిపాలిటీలో వాటర్ వర్క్స్ విభాగం లో పనిచేస్తున్న కార్మికులందరూ మున్సిపల్ ఆఫీస్ ముందు కూర్చొని 43వ వార్డ్ కౌన్సిలర్ తోట వంశీకృష్ణ పై చర్యలు తీసుకోవాలని అలాగే పిట్ల సీను కొట్టినందుకు గాను కార్మికులందరూ కౌన్సిలర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు మున్సిపల్ కమిషనర్ పర్వతాలుకు మెమోరండం ఇవ్వడం జరిగింది. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ నా యొక్క వర్కర్ ను కొట్టడం తప్పు అని చెప్పడం జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీనివ్వడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికున్ని కొట్టడం చాలా అమానుషం, అఘాయిత్యం అని ఒకవేళ అతను కొట్టిన సమయంలో తగలరానీ చోట తలిగి మరణించినట్లయితే దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని కార్మికులందరం ఐకమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు. మునుముందు ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే మాత్రం ఊరుకునేది లేదని తెలియపరచడం జరిగింది. ఇట్టి ధర్నా కార్యక్రమానికి కామారెడ్డి ఎస్ హెచ్ ఓ నరహరి వచ్చి మీరు ధర్నా విరమించండి అతనిపై కేసు నమోదు అయిందని చెప్పడం జరిగింది. మరియు కేసు నంబర్ కూడా చూపించడం జరిగింది . పై విషయాన్ని తెలపగానే వాటర్ వర్క్స్ కార్మికులు ధర్నాను ముగించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సిఐటియు జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్ రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు అధ్యక్షులు అయ్యారు ప్రధాన కార్యదర్శి కాత్రియాల ప్రభు వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగరావు ఉపాధ్యక్షులు ప్రభాకర్ ఏ రాజు కే సాయిలు నాయకులు శ్రీనివాస్ లింగం కన్నెపల్లి శ్రీనివాస్ నాగరాజ్ చరణ్ డి లింగం టి రాజు భాస్కర్ నరేష్ ఎల్లవ్వ భూలక్ష్మి సుజాత ఏఐటీయూసీ అధ్యక్షులు లక్ష్మణ్,సుదర్శన్, జి రాజు ఆర్ లక్ష్మణ్,లు మద్దతు ప్రకటించడం జరిగింది ఈ కార్యక్రమంలో దాదాపు 140 మంది మహిళా కార్మికులు అందరూ పాల్గొన్నారు.

## వేములవాడలో సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి)**

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను వేములవాడలో ఘనంగా నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.గురువారం వేములవాడలో బతుకమ్మ పండుగ సందర్భంగా ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మ నిమజ్జనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సుమారు రూ 32 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో బతుకమ్మ పండుగ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. వేములవాడ రాజన్న సన్నిధిలో ఏడు రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకత అన్నారు.ఇతర ప్రాంతాల్లో తొమ్మిది రోజులపాటు, కొన్ని ప్రాంతాల్లో 11 రోజులపాటు బతుకమ్మ పండుగ జరుపుకుంటారన్నారు.వేములవాడలో ఏడు రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం వల్ల ఆడబిడ్డలకు పుట్టింట్లోనూ, మెట్టినింట్లోనూ బతుకమ్మ పండుగలో పాల్గొనే అవకాశం లభిస్తోందన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ఎలాంటి కీడు కలగకూడదని మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మను ఆడుతూ నిమజ్జనం చేస్తారని చెప్పారు..వేములవాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు గత వారం రోజులుగా శ్రమించి బతుకమ్మ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.



## పబ్లిక్ స్కూల్ కల సాకారం

- తన ప్రతిపాదనతో ప్రభుత్వం మంజూరు చేసిందన్న ఎమ్మెల్యే ధన్ పాల్
- కోట గల్లి బాలికల ఉన్నత పాఠశాల ఎంపిక
- కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి పరిశీలన

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి): తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం కొరకు ప్రభుత్వానికి తాను ప్రతిపాదన పంపడంతో మంజూరు చేసినట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి గురువారం నగరంలోని కోటగల్లి బాలికల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జిల్లాలో రెండు పబ్లిక్ స్కూల్ లను ఎంపిక చేశారన్నారు. ఇందులో భాగంగా అర్బన్ నియోజకవర్గంకు సంబంధించి నగరంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. తాను గతంలో అనేకసార్లు పాఠశాలను పరిశీలించడం జరిగిందని, ఇక్కడి పరిస్థితిని చూసి పబ్లిక్ స్కూల్ కోసం ప్రతిపాదన పంపడం జరిగిందన్నారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని గుర్తుచేశారు. పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అయితే నిధులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. త్వరలోనే డిపిఆర్ సిద్ధం చేసి, టెండర్లను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులో తీసుకొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఇప్పటికే ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కూడా రాబోతుందన్నారు. అలాగే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించిన విధంగా డివిజన్కు రూ.20 లక్షల పనులు ప్రారంభమవుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భుజంగరావు, మేయర్ ఉమారాణి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, బీజేపీ కార్పొరేటర్లు ప్రసన్న శ్యామల సత్యపాల్, నాగోల్ల లక్ష్మీనారాయణ, చింతకాయల రాజేందర్, అధికారులు పాల్గొన్నారు

## లింగాపూర్‌లో మేగా లెదర్ ఇండస్ట్రీని ప్రారంభించండి

- మంత్రి అడ్లూరికికు వినతి..
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లెదర్ ఇండస్ట్రీ ఏర్పాటు కోసం 10ఎకరాల భూమి కేటాయింపు కోసం లేఖ



**అంతర్గాం, జనంసాక్షి :**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లింగాపూర్ గ్రామ శివారులో మేగా లేదర్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయించి ఎస్సీ ఎస్సీ ఉపకులాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు గురువారం ధర్మపురి లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి బాపయ్య, సీనియర్ జర్నలిస్టు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస రాజేష్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు పానుగంటి రాజలింగం, అక్కపాక రమేష్ లు కలిశారు, నిరుపేద దళిత వర్గాలకు ఉపయోగపడాలన్న సదుద్దేశంతో 25 సంవత్సరాల క్రితం ఆనాటి ప్రభుత్వాలు లింగాపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 132, 134 లో 25 ఎకరాల భూమిని లెదర్ ఇండస్ట్రీ కోసం కేటాయించినప్పటికీ అది ఇప్పటికి కార్యరూపం దాల్చలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు 25 ఎకరాల భూమి ప్రస్తుతం అందుబాటులో లేని కారణంగా గ 10 ఎకరాల భూమి ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుముఖత వ్యక్తం చేస్తూ లేఖ కూడా ఇచ్చారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు సింగరేణి,ఎన్టిపిసి, ఆర్ ఎఫ్ సి ఎల్, సిమెంట్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ గురుకుల పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో వివిధ పరిశ్రమలకు లెదర్ షూస్ బెల్టులు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు లెదర్ షూస్ అవసరం ఉంటుందని, లెదర్ ఇండస్ట్రీ ఏర్పాటు జరిగితే దాదాపు 1000 మంది ఎస్సీ, ఎస్సీ ఉపకులాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని మంత్రి కి వివరించారు, లెదర్ షూస్ బ్యాగులు సూట్ కేసులు పర్సు లు, బెల్టులు, లేడీస్ బ్యాగ్స్ లెదర్ సంబంధిత వస్తువులు తయారు కావడమే కాక ఈ ప్రాంతం నుండి దళితులు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాక అనేకమందికి ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు, లింగాపూర్ గ్రామ శివారులో మేగా లెదర్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయించి ఎస్సీ ఎస్సీ ఉపకులాల కు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## భూపతిపూర్ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి



రాయికల్ అక్టోబర్ 15: జనంసాక్షి:రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామాన్ని ఈరోజు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుమారి హరిణి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దుర్గామాత వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామపంచాయతీ నిర్వహణ, రికార్డుల పరిరక్షణ, గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై వారి సంఘాల రికార్డులను పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, స్వయం సమృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి ఎంపీడీవో చిరంజీవి గ్రామ సర్పంచ్ గుర్రం భావన మహేందర్ గౌడ్ మరియు ఉప సర్పంచ్ మూగల సంజీవ్ చారి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆదిత్య రాజ్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల పనులను గడువులో పూర్తి చేయాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 15(జనంసాక్షి):** నవంబర్ 1 నుంచి మే 31 వరకు అన్ని పనులు పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి.జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ప్రసునాంబలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, పుష్కరాల పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, పనులను సకాలంలో పూర్తి చేయకపోతే జిల్లాకు చెడ్డపేరు వస్తుందని అన్నారు. ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించుకొని, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు చేపట్టే ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ, అవసరమైన చోట జనరేటర్లు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు పనులు చేపట్టాలని సూచించారు.నవంబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మే 30వ తేదీ వరకు అన్ని శాఖలు తమ పరిధిలోని పనులను పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి ప్రకారం పనుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, హెడ్ ఆఫీస్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అంశాలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నోటిఫికేషన్లను సోమవారం నుంచి జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్ అండ్ బి రోడ్లకు సంబంధించి 10-ఏ మినహాయింపు ప్రతిపాదనలు పంపించా మని, అనుమతులు మూడు రోజుల్లో అందితే వెంటనే భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేయాలని సూచించారు. ముందుగా భూమిని సేకరించి, పరిహారం చెల్లింపులు పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ధర్మపురిలో మహాలక్ష్మి ఘాట్, రోడ్డు విస్తరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పునరుద్ధరణకు సంబంధించిన కూల్చివేత పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, కోటిలింగాల ఆలయ కూల్చివేత పూర్తయినందున అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది భక్తులు రానున్న నేపథ్యంలో రోడ్లపై ఎట్టి పరిస్థితులలో ట్రాఫిక్ జామ్ జరగకుండా ముందస్తు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వాహనాలు సులభతరంగా వెండే విధంగా రూట్ మ్యాప్ లను సిద్ధం చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు .గత పుష్కర స్నానాల సమయంలో మురికి నీరు, కొంత గోదావరి నదిలో కలవడం వల్ల వివాదం అయిందని ఆ పరిస్థితి రాబోయే పుష్కరాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఉండకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, 2015 గోదావరి పుష్కరాల సమయంలో సుమారు 1.50 కోట్ల మంది భక్తులు వచ్చారని, 2027 పుష్కరాలకు సుమారు 2.40 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

## సుప్రీం వరకు పాదయాత్ర సరికాదు

### రాహుల్ గాంధీపై కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలతో కలిసి రాహుల్ సుప్రీంకోర్టు వరకు పాదయాత్రగా వెళ్లి, అక్కడ నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే దీనిని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ఆదేశించింది. ఇలాంటి చర్యల ద్వారా న్యాయవ్యవస్థను బెదిరించలేరని మందలించింది.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ.. 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరిట సోమవారం ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేపట్టారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సర్ ప్రక్రియపై ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నిస్తూ సుప్రీంలో పిటిషన్ వేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం, ఎన్నికల సంఘానికి న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. అయితే, నోటీసులు ఇవ్వడమంటే.. రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది. "రాజకీయ పాదయాత్రలు న్యాయస్థానం వరకు రావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇలాంటివి జరగకూడదు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు. ఇవన్నీ కోర్టుపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలే. ఇలాంటి బలహీన చర్యలను ఎవరూ పట్టించుకోరు" అని వ్యాఖ్యానించింది. అలాగే పాదయాత్రకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణలో భాగంగా రాహుల్ గాంధీ ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు నోటీసులు ఇచ్చింది. కోర్టు ప్రాంగణంలో నిరసనలకు సంబంధించిన రికార్డింగ్‌లను పోలీసులను ఆదేశించింది.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో

# రైతులకు అధిక ఆదాయం

- భూమి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలి
- అందరి దృష్టి ఆయిల్ ఫామ్ తోటపై దృష్టి సారించాలి
- రైతులకు సూచించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15 (జనంసాక్షి):** రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. రాబోయే యాసంగి సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు.

**ఆయిల్‌పామ్, టమోటా తోటల పరిశీలన**

కామారెడ్డి జిల్లాలో రైతులు సాగు చేస్తున్న ప్రత్యామ్నాయ పంటలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం సందర్శించి పరిశీలించారు. తొలుత రైతు అర్జున్ రావు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించి, పంట సాగు విధానం, దిగుబడులు, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు అర్జున్ రావు మాట్లాడుతూ, సంప్రదాయ వరి సాగుతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగు ద్వారా మెరుగైన ఆదాయం పొందుతున్నానని, ఈ పంట సాగు పట్ల సంతృప్తిగా ఉన్నానని కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం శివాయిపల్లి గ్రామంలో రైతు గురువా రెడ్డి సాగు చేస్తున్న టమోటా తోటను కలెక్టర్ పరిశీలించారు. టమోటా సాగు విధానం, పంట దిగుబడులు, మార్కెటింగ్, ఆదాయ వివరాలపై రైతుతో చర్చించారు. వరి పంటతో పోలిస్తే టమోటా సాగు ద్వారా అధిక ఆదాయం పొందుతున్నానని, ప్రత్యామ్నాయ పంటల సాగు తనకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తోందని రైతు వివరించారు.

### వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు

ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో పాటు సాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను అంచనా వేసుకుని, భూమికి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్, టమోటా వంటి పంటలను సాగు చేసే ముందు సంబంధిత వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు వాతావరణ పరిస్థితులు, భూమి స్వభావం, సాగునీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపికలో మార్పులు చేసుకోవడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి జ్యోతి, ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, హిందుస్థాన్ యూనిలీవర్ సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, సీనియర్ నిర్వాహకులు శ్రీనివాస్, ఆయిల్‌పామ్ సిబ్బంది హిమకుమార్, అరుణ్, మురళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్,హెచ్ఎం, లను రెగ్యులరైజ్ చేయాలి

- సమాన పనికి సమాన వేతనం కల్పించాలి
- ఎన్ హెచ్ ఎం ల నిరవధిక సమ్మె
- నేషనల్ హెల్త్ మిషన్ డాక్టర్లు

**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 15 (జనం సాక్షి):** శాశ్వత ఉద్యోగులతో సమానంగా నేషనల్ హెల్త్ మిషన్ లో డాక్టర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సమాన హక్కులు కల్పించాలని డాక్టర్ నయీంజాన్, డాక్టర్ స్రవంతిరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఎన్,హెచ్,ఎం లు నిరవదిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఎన్,హెచ్,ఎం లు నిరవదిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా పనిచేసినా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 17వేల మంది ఉద్యోగులము పనిచేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రెగ్యులరైజ్ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన ఏడు రాష్ట్రాల్లో రెగ్యులరైజ్ చేసినప్పుడు తెలంగాణలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. ప్రభుత్వం హక్కులు కల్పిస్తూ ఆర్టికల్ 14,16,39 డి ప్రకారం సమాన పనికి సమాన హక్కులు, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు.

నిత్యవసర ధరల పెరుగుదల వల్ల చాలీచాలని జీతంతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. మహిళ ఉద్యోగులకు 180 రోజులు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత ,ఆరోగ్య బీమా ప్రతి ఉద్యోగికి కల్పించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం లను గుర్తించి రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన వచ్చేం తవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశా రు. ఈ కార్యక్రమంలోడాక్టర్ విశ్వేశ్వర్, డాక్టర్ స్రవంతి రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ చిరంజీవి, శిరీష, డాక్టర్ గౌస్ బాషా, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

**ఎన్ హెచ్ఎం సిబ్బంది ధర్నాకు ఎమ్మెల్యే ధన్ పాల్ మద్దతు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15, జనం సాక్షి:** ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను వచ్చే అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావిస్తానని, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కొనసాగుతున్న ధర్నాకు గురువారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలోని ఇతర రాష్ట్రాల్లో రెగ్యులరైజ్ చేసినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ఉద్యోగులంతా న్యాయమైన డిమాండ్లను కోరుతున్నారని వారికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నానన్నారు. ముఖ్యంగా ఇంక్రిమెంట్లతోపాటు బోనస్ కూడా ప్రకటించాలన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగి మరణించినట్లయితే ఇన్సూరెన్స్ తో కుటుంబంలో ఒకరికి విద్యార్హతను బట్టి ఉద్యోగం కల్పించాలన్నారు. ధర్నాలో ఎన్ హెచ్ ఎం జిల్లా అధ్యక్షులు సందీప్, నారాయణ, అక్షయ్, విశాల తదితరులు పాల్గొన్నారు.



## ఐదు రోజుల శిశువుకు అరుదైన మెదడు శస్త్రచికిత్స

**యశోద ఆసుపత్రి వైద్యుల ఘనత**







**కామారెడ్డి, అక్టోబర్ 15 (జనంసాక్షి):** సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు ఐదు రోజుల నవజాత శిశువుకు అరుదైన మెదడు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రసవ సమయంలో తీవ్ర గాయమై మెదడులో రక్తస్రావం కావడంతో శిశువును వరంగల్ నుంచి కృత్రిమ శ్వాస సహాయంతో యశోద ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కృష్ణ తేజ్ రెడ్డి, అయ్యదురై నేతృత్వంలోని బృందం ఆధునిక సాంకేతికతతో మెదడులో పేరుకుపోయిన రక్తాన్ని తొలగించింది. ప్రస్తుతం శిశువు కోలుకుంటూ సాధారణంగా పాలు తాగుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలోని నవజాత శిశు వైద్య, నాడీ శస్త్రచికిత్స, మత్తువైద్య విభాగాల సమన్వయంతో ఈ చికిత్స విజయవంతమైంది. యశోద ఆసుపత్రిలో మెదడు కణితులు, మూర్ఛ, మెదడులో రక్తస్రావం, వెన్నెముక సమస్యలకు అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

# పల్లె వెలుగు ఎరుగని పల్లెలెన్నో!

- ఎనిమిది గ్రామ పంచాయతీలకు బస్సు సౌకర్యం కరువు
- 20 ఏళ్లుగా పల్లె వైపు చూడని ఆర్టీసీ బస్సులు
- ఎమ్మెల్యే, డిపో మేనేజర్‌కు విన్నవించినా ఫలితం శూన్యం
- ప్రైవేటు పాఠశాల బస్సులు, ఇతరుల వాహనాలే దిక్కు

**గాంధారి, అక్టోబర్ 15 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రజా రవాణాకు ప్రాధాన్యమిస్తున్నా గాంధారి మండలంలోని పలు గ్రామాలకు మాత్రం బస్సు సౌకర్యం అందని ద్రాక్షగానే మారింది. ఎనిమిది గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు దాదాపు 20 ఏళ్లుగా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామాలకు ప్రైవేటు పాఠశాలల బస్సులు, అంబులెన్సులు వస్తున్నా ఆర్టీసీ బస్సులు మాత్రం రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, ఇతర ప్రయాణికులు ద్విచక్ర వాహనాలు, ప్రైవేటు వాహనాలు, ఇతరుల నుంచి లిఫ్టులు పొందుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

### ఎనిమిది గ్రామ పంచాయతీలకు బస్సు సౌకర్యం కరువు

గాంధారి మండలంలోని తిప్పారం, తిప్పారం తండా, గొల్లాడి తండా, సోమారం తండా, పిసికిల్ గుట్ట, పెద్ద గుజ్జులు, చిన్న గుజ్జులు, లొంక తండా, దుర్గం తదితర గ్రామాలు, తండాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మల్ తండా సహ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా రవాణా సమస్యలు ఎదురవుతున్నాయి. వందలాది మంది నివసించే ఈ ప్రాంతాలకు బస్సులు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గాంధారి నుంచి తిప్పారం మీదుగా తండాలకు, అలాగే దుర్గం మార్గంలో పిసికిల్ గుట్ట, పెద్ద గుజ్జులు, చిన్న గుజ్జులు, లొంక తండా తదితర ప్రాంతాలకు బస్సులు నడిపితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు.

### 20 ఏళ్లుగా నిలిచిన బస్సు సౌకర్యం

గ్రామస్తుల కథనం ప్రకారం, 2006లో ఈ మార్గంలో బస్సు నడిచేది. అయితే బస్సులో సీటు కోసం ప్రయత్నించిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు టైరు కింద పడి మృతి చెందడంతో అప్పటి నుంచి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయని చెబుతున్నారు. ఒక ప్రమాదం కారణంగా ఇన్నేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

### వినతులు చేసినా స్పందన కరువు

ఎనిమిది గ్రామ పంచాయతీలకు బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేలతో పాటు కామారెడ్డి డిపో మేనేజర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాలను కలుపుతూ ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతున్నారు.

### రాకపోకలకు చాలా ఇబ్బంది : విలాస్ రైతు



గాంధారి మండల కేంద్రానికి చేరుకోవాలంటే దాదాపు లిఫ్టుల ద్వారా ఏదైనా ప్రైవేట్ స్కూల్ బస్సు వస్తే గాని వెళ్లలేని దౌర్భాగ్య పరిస్థితి. ఇలాంటి విపత్కర పరిస్థితి ఎవరికి రాకూడదు.

### ప్రైవేట్ వాహనాలకు ఎంత అడిగితే అంత: రైతు బోధన్ నాయక్



ఎక్కడికైనా వెళ్లాలన్నా, గాంధారి మండల కేంద్రం నుంచి తమ గ్రామాలకు తిరిగి రావాలన్నా, చివరికి ఎరువులు తెచ్చుకోవాలన్నా ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. వాహనదారులు ఎంత డబ్బు అడిగితే అంత చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

## వ్యాపార అనుమతి లేకుండానే రెండేళ్లుగా దుకాణం నిర్వహణ!

**ఎస్వీ మార్ట్‌కు రూ.50 వేల జరిమానా**

**మంథని, అక్టోబర్ 15, (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఎస్వీ మార్ట్ ఎలక్ట్రానిక్స్ అండ్ సూపర్ మార్కెట్‌కు మున్సిపల్ అధికారులు రూ.50 వేల జరిమానా విధించారు. గత రెండేళ్లుగా మున్సిపాలిటీ నుంచి తప్పనిసరిగా పొందాల్సిన వ్యాపార అనుమతి లేకుండానే దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, యాజమాన్యం అనుమతి పొందకపోవడంతో జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాపార అనుమతి పొందాలని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహించే దుకాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతోపాటు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనలను పాటిస్తూ, అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే వ్యాపారాలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు.




## సింగరేణి కార్మిక గర్జన గ్రాండ్ సక్సెస్

**టీబీజీకేస్ గౌరవాధ్యక్షులు కొప్పుల ఈశ్వర్**

**గోదావరిఖని, అక్టోబర్ 15 (జనంసాక్షి):** గోదావరిఖని సింగరేణి జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన భారీ బహిరంగ సభ సింగరేణి కార్మిక గర్జన గ్రాండ్ సక్సెస్ అయ్యిందని టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్ తో కలిసి ఈశ్వర్ మాట్లాడారు. బహిరంగ సభను కార్మికులు, కార్మిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయడం పట్ల ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సింగరేణి 130 సంవత్సరాల చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో కార్మికులు హాజరై విజయవంతం చేసినందుకు సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గడిచిన మూడు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ప్రజల్లో నిగూఢమైన ఆరోపణ ఉందన్నారు. సింగరేణి సంస్థను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థ విరాజిల్లిందని, ప్రస్తుతం సంస్థ కార్మికులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.




తెలంగాణ ఉద్యమ సమయంలో 42 రోజులు సమ్మె చేశారని, దాంతో దక్షిణాది రాష్ట్రాలు చీకటిమయంలో మగ్గాయని పేర్కొన్నారు. కెసిఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఈశ్వర్ తెలిపారు. మూడు సంవత్సరాల కాలంలో మెడికల్ బోర్డును భ్రష్టు పట్టించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ హయాంలో దాదాపు 18 వేల మంది డిపెండెంట్ ద్వారా ఉద్యోగాలు పొందారని ఆయన గుర్తు చేశారు. సంస్థలో రాజకీయ జోక్యం అంతకు అంతా పెరిగిపోయిందని మండిపడ్డారు. గుర్తింపు సంఘాలుగా ఫోజులు కొడుతున్న ఏఐటియుసి.. ఐ ఎన్ టి యు సి కార్మికులకు చేసింది ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు. ధనార్జన ధ్యేయంగా ఈ రెండు సంఘాలు కార్మికులను మోసం చేస్తున్నాయని ఈశ్వర్ అన్నారు. కాంగ్రెస్ కేవలం మూడు మెడికల్ బోర్డులు మాత్రమే నిర్వహించిందని ఆయన ఆరోపించారు. సింగరేణి సంస్థ అనేది కార్పొరేటర్ సంస్థగా ఉందని, దాన్ని కాంగ్రెస్ రాజకీయ సంస్థగా వాడుకుందని తెలిపారు. కార్మికులకు ఇస్తున్నది బోనస్ కాదని భోకస్ అని ఆయన మండిపడ్డారు. సింగరేణి కార్మిక గర్జన గోదావరిఖనిలో పెడుతున్నామని కాంగ్రెస్ నాయకులు ముందుగానే ప్రకటించి చేతులు దులుపుకున్నారని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. సింగరేణి కార్మిక గర్జన సభ పెట్టకుంటే కార్మికులకు లాభాల వాటా ఎగ్గొట్టే వారని ఆయన ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహణ లోపంతో అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొందని కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తితో లేదని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య, శ్యామల-రమేష్, నడిపెల్లి మురళీధర్ రావు, నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ నుంచి ప్రపంచానికి ఫీల్డ్ బేస్‌బాల్

**నిరుపేద క్రీడాకారులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ అవకాశాలు**

**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** నిరుపేద క్రీడాకారులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు మొహమ్మద్ ముఫజిల్ అహ్మద్ ఫీల్డ్ బేస్‌బాల్ క్రీడను పరిచయం చేస్తున్నారు. 2010 నుంచి వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 2,472 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి, 184 మంది క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ప్రోత్సహించారు. క్రీడా పరికరాల కొరత, శారీరక దారుఢ్యం, ఎత్తు, బరువు వంటి కారణాలతో ప్రతిభావంతులు అవకాశాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ క్రీడను రూపొందించినట్లు తెలిపారు. ఒకే బంతితో 16 లేదా 32 మంది ఆడగలగడం, బాలబాలికలందరికీ సమాన అవకాశాలు ఉండటం దీని ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఫీల్డ్ బేస్‌బాల్ నియమాలను పరిశీలించిన పలువురు క్రీడా అధికారులు, సంఘాల ప్రతినిధులు ఈ క్రీడను అభినందించి సహకరిస్తామని తెలిపారు. ఈ క్రీడ ద్వారా తెలంగాణతో పాటు దేశానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ముఫజిల్ అహ్మద్ ఆకాంక్షించారు.




## రుద్రంగి మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది

**రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం**

**రుద్రంగి అక్టోబర్ 15 (జనం సాక్షి):** రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో సుమారు రూ.42 లక్షలతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ... రుద్రంగి మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.70 లక్షలకు పైగా నిధులతో పనులకు టెండర్లు పూర్తయ్యాయని వెల్లడించారు. త్వరలోనే ఈ పనులకు భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు



అభివృద్ధికి సంబంధించి ప్రస్తుతం ట్రెజరీలో సుమారు రూ.5 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మరో రూ.కోటి నిధులు రావాల్సి ఉందని చెప్పారు. మొత్తంగా రూ.6 కోట్లకు పైగా నిధులతో రుద్రంగి మార్కెట్ పరిధిలోని రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నాయకత్వంలో రూ.76 వేల కోట్ల రుణమాఫీ జరిగిందని గుర్తుచేశారు.

# దిగ్వాల్‌లో అక్రమ నీటి దందా?

- అనుమతులు లేకుండానే భూగర్భ జలాల తోడుకోలు
- నీటి వ్యాపారంపై అధికారుల నిర్లక్ష్యమెందుకు?
- క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికుల డిమాండ్

**కోహిర్, అక్టోబర్ 14 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో భూగర్భ జలాల వినియోగంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే భూగర్భ జలాలను తోడుతూ, ట్యాంకర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి నీటి వ్యాపారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీటి వనరుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### నీరు ప్రజల అవసరానికా.. వ్యాపారానికా?

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, వ్యవసాయం, పశువుల అవసరాలకు ప్రజలు బోర్లు, బావులపై ఆధారపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భూగర్భ జలాలను పెద్ద మొత్తంలో తోడి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. నీటిని ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నట్లయితే, అందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? సంబంధిత శాఖల నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

### అనుమతులపై అధికారుల తనిఖీలు ఎక్కడ?

నీటి వ్యాపారం జరుగుతోందనే ఆరోపణల నేపథ్యంలో భూగర్భ జలాల శాఖ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నీటిని సేకరిస్తున్న ప్రాంతాలు, ఉపయోగిస్తున్న బోర్లు, బావులు, ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న రవాణాను పరిశీలించి అవసరమైన అనుమతులు ఉన్నాయో లేదో నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.




నిబంధనలకు విరుద్ధంగా నీటిని తోడుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధంగా నీటి వినియోగం జరుగుతుంటే ప్రజల్లోని అనుమానాలను నివృత్తి చేసేలా అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

### భూగర్భ జలాలు అడుగంటితే రైతులకు ఇబ్బందులే!

భూగర్భ జలాలను విచక్షణారహితంగా తోడితే భవిష్యత్తులో బోర్లలో నీటి మట్టాలు తగ్గే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడే రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. అయితే దిగ్వాల్‌లో వాణిజ్య అవసరాలకు నీటిని వినియోగించడం వల్ల నీటి మట్టాలపై ఎలాంటి ప్రభావం పడుతోందన్నది అధికారుల పరిశీలనతోనే స్పష్టమవుతుంది.

### ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా?

గ్రామ పరిసరాల్లో నీటి వ్యాపారంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. భూగర్భ జలాల వినియోగంపై పర్యవేక్షణ చేపట్టి, అనుమతులు, నిబంధనలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నీటి వినియోగం జరుగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని, నీటి వనరులు వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



# డీసీసీ పీఠంపై తొలి మహిళ

- డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత
- రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బాధ్యతల స్వీకరణ

**రంగారెడ్డి, అక్టోబర్ 15 (జనం సాక్షి):** జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోని డీసీసీ కార్యాలయంలో గురువారం వేదమంత్రోచ్చారణలు, కార్యకర్తల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన అధ్యక్షురాలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేందుకు పారిజాత నర్సింహారెడ్డి నాయకత్వం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించిన డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ గురుతర బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ అధిష్టానానికి, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకరణకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంత్ రావు, మాజీ డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, సరితా తిరుపతయ్య, చరణ్ కౌశిక్ యాదవ్, రఘునాథ్ యాదవ్, కాల్వ సుజాత, సామ రామ్మోహన్ రెడ్డిలతో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షురాలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# మన్సూరాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాల ఆరోపణలు!

- అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని బాధితుల ఆవేదన
- ఇళ్ల పేరుతో లక్షల్లో వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు

**హయత్ నగర్, అక్టోబర్ 15 (జనం సాక్షి):** ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ పరిధిలో ఉన్న 'ఏరుకల నాంచారమ్మ నగర్'లో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అర్హులైన స్థానిక పేదలకు ఇళ్లు దక్కడం లేదని, కొందరు మధ్యవర్తులు ఇళ్లు ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

### 84 ఖాళీ ఇళ్ల చుట్టూ వివాదం

స్థానికుల కథనం ప్రకారం, మన్సూరాబాద్‌లోని సుమారు 1.34 ఎకరాల స్థలంలో రెండు బ్లాకులుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించారు. వీటిలో బి బ్లాక్‌లో ఖాళీగా ఉన్నట్లు చెబుతున్న 84 ఇళ్ల కేటాయింపులపై వివాదం నెలకొంది. ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కొంతమంది సగం మొత్తం చెల్లించినప్పటికీ, మిగిలిన డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### స్థానికేతరులకు కేటాయింపులపై అభ్యంతరాలు

సుమారు 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్న అర్హులైన పేదలకు ఇళ్లు దక్కకపోగా, ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన వారికి ఇళ్ల పట్టాలు కేటాయించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తమకు ఇళ్లు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నిస్తే, డబ్బులు చెల్లించిన వారికే ఇళ్లు వస్తాయని కొందరు మధ్యవర్తులు చెబుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఇళ్ల పట్టాలు పొందిన కొందరు వాటిని రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

### అధికారుల పాత్రపై విచారణ కోరుతున్న బాధితులు

ఈ వ్యవహారంలో జగన్నాథం గంగయ్య అలియాస్ సాగర్ గంగయ్యతో పాటు మరికొందరు మధ్యవర్తుల పాత్రపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే హౌసింగ్ పీడీ చంప్లా నాయక్ పాత్రపైనా అనుమానాలు ఉన్నాయని ఎరుకల సంఘం నాయకులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ, అధికారిక విచారణ నివేదికలు అందుబాటులో ఉన్నాయా అన్నది నిర్ధారించాల్సి ఉంది. గతంలో స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టినట్లు బాధితులు చెబుతున్నారు. అయినప్పటికీ, ఇప్పటివరకు తమకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, స్థానికులు అడ్డుకున్నట్లు బాధితులు వెల్లడించారు.

### అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్

ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని, అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని బాధితులు, ఎరుకల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపులు జరిగినట్లు తేలితే సంబంధిత పట్టాలను రద్దు చేసి, బాధ్యులైన మధ్యవర్తులు, అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పేదల సొంతింటి కలను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలపై ప్రభుత్వం స్పందించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చేవెళ్లలో 670 గ్రాముల గంజాయి స్వాధీనం

**లేబర్ అడ్డా వద్ద విక్రయించేందుకు యత్నం.. నిందితుడి అరెస్ట్**

**చేవెళ్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి):** చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 670 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వనం శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్ కుమార్ (25) ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం ముట్‌పూర్ గ్రామంలో నివసిస్తూ హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదనపు డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్వగ్రామానికి చెందిన కామేశ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. షాద్‌నగర్, కొందుర్గ్ ప్రాంతాల్లోని కార్మికుల అడ్డాల వద్ద ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మిగిలిన గంజాయి ప్యాకెట్లను చేవెళ్ల లేబర్ అడ్డా వద్ద విక్రయించేందుకు వచ్చిన సమయంలో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 670 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ వనం శిరీష వెల్లడించారు.



# రాబోయే ఎన్నికల్లో బరిలో ఉంటా.. ఎన్ని కుట్రలు చేసినా బెదరను.

**మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి**



తాండూరు అక్టోబర్ 15(జనంసాక్షి): రాబోయే ఎన్నికల్లో తాను బరిలో ఉంటానని, ఎన్ని ఎత్తుగడలు, కుట్రలు, ప్రయోగాలు చేసినా బెదరబోనని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. తనకు టికెట్ రాదని కొందరు కావాలని విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గురువారం తాండూరులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నేను పోటీలో ఉంటాను. ప్రజలే నాకు అండ. తాండూరు ప్రజలకు సేవ చేయడానికే నేను రాజకీయాల్లోకి వచ్చాను. నాకు టికెట్ రాదని, నేను పార్టీ మారుతున్నానని కొందరు కావాలనే విషప్రచారం చేస్తున్నారు. ఇలాంటి పుకార్లను నమ్మవద్దని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ప్రయోగాలు చేసినా నేను భయపడను. నా వెనుక తాండూరు ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు. అభివృద్ధి, ప్రజా సేవే నా లక్ష్యం. ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుందామని పైలెట్ రోహిత్ రెడ్డి సవాల్ విసిరారు.

# బుల్లెట్ ట్రైన్ సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి

**సూర్యాపేట, (జనంసాక్షి):** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రముఖ వైద్యులు, కౌన్సిలర్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో యాదవ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా సూర్యాపేటకు రైల్వే మార్గం రావాలన్న ప్రజల కలలను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. శంషాబాద్ నుండి సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మార్చవద్దని కోరారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వస్తే విద్యా, వైద్య, వ్యాపార రంగాలు మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.
కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం సూర్యాపేటను బలి చేయవద్దని అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు ఉద్యమం ఆగదని తెలిపారు.




# మైనర్ బాలికపై అత్యాచారం.. నిందితుడికి 20 ఏళ్ల జైలు

**రూ.18 వేల జరిమానా విధించిన సిద్దిపేట న్యాయస్థానం**

**నంగునూరు, అక్టోబరు 15(జనం సాక్షి ):** మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి, అపహరించి, వివాహం చేసుకుని అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం కఠిన శిక్ష విధించింది. నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.18 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలానికి చెందిన మైనర్ బాలికను బండి భాస్కర్ (27) ప్రేమ పేరుతో నమ్మించాడు. వివాహం చేసుకుని అత్యాచారం చేశాడని వచ్చిన ఫిర్యాదు మేరకు 2022 ఏప్రిల్ 22న రాజగోపాలపేట పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అప్పటి దర్యాప్తు అధికారి, రాజగోపాలపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది సాదుల ఆత్మారాములు వాదనలు వినిపించారు.
సాక్షుల వాంగ్మూలాలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన సిద్ధిపేట మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి వై.జయప్రసాద్ నిందితుడిని దోషిగా నిర్ధారించారు. 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.18 వేల జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు. ఈ కేసు విచారణలో ప్రస్తుత సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై టి.వివేక్, ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస రెడ్డి, సీడీఓ రవి, భరోసా కేంద్రం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ బి. దుర్గ, భరోసా న్యాయాధికారి సౌమ్య, భరోసా సిబ్బంది సమన్వయంతో సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ అభినందించారు.

### మహిళల భద్రతకు ప్రాధాన్యం

మహిళలు, బాలికలపై ఎలాంటి నేరాలు జరిగినా భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పోలీసు కమిషనర్ సూచించారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. నేరస్థులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పోక్సో కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

**అల్వాల్, అక్టోబరు 15 (జనంసాక్షి):** పోక్సో కేసులో బోలారం దశరథ్ (49)కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టు ఈ నెల 13న తీర్పు వెలువరించినట్లు అల్వాల్ సీఐ ఎ.ప్రశాంత్ తెలిపారు. ఖానాజిగూడ సుభాష్‌నగర్‌కు చెందిన దశరథ్‌పై అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో క్రైమ్ నంబర్ 102/2019గా కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 354-ఏ, 354-డీ, పోక్సో చట్టంలోని సెక్షన్లు 11, 12 కింద విచారణ జరిగింది. ఎస్సై బి.ఎస్.ఎస్.వరప్రసాద్ దర్యాప్తు చేపట్టగా, ఏపీపీ జి.ప్రభాకర్‌రెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

### కందవాడ-తొల్కట్ట అనుసంధాన రహదారి నిర్మించాలి



**చేవెళ్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి):** చేవెళ్ల మున్సిపాలిటీ ఆరో వార్డు పరిధిలోని కందవాడ నుంచి తొల్కట్ట వరకు అనుసంధాన రహదారిని నిర్మించాలని కోరుతూ కందవాడ వార్డు బీజేపీ నాయకులు గురువారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాలతో పాటు రెండు మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని నాయకులు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, ఉద్యోగుల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కందవాడ--తొల్కట్ట అనుసంధాన రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు.

# పాఠశాల పక్కన సెల్ టవర్ తొలగించాలి

**ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి**

**కీసర, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ప్రజల భద్రత, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నాగారం ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న రూఫ్‌టాప్ సెల్ టవర్‌ను తక్షణమే తొలగించాలని సామాజిక కార్యకర్త అక్కాల సురేష్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో సెల్ టవర్ ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రజలకు, విద్యార్థులకు రక్షణ కల్పించేలా టవర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరినట్లు చెప్పారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఈటల రాజేందర్.. జోనల్ కమిషనర్ రాధికా గుప్తాతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారని వెల్లడించారు. సంబంధిత టెలికాం అధికారులతోనూ మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ ఆసుపత్రికి 65 లక్షల విలువైన పరికరాలు అందజేత

- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సి ఎస్ ఆర్ నిధులు
- కృతజ్ఞతలు తెలిపిన సూపరింటెండెంట్ ఎల్ రాములు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి):** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 65 లక్షల విలువైన వైద్య పరికరాలను అందజేశారు. పీడియాట్రిక్స్ విభాగం ప్రొఫెసర్ ప్రభుత్వాసుపత్రి నిజామాబాద్ మాజీ సూపరింటెండెట్ డాక్టర్ పి శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జలగం తిరుపతిరావు పర్యవేక్షణలో ఈ వైద్య పరికరాలు సి ఎస్ ఆర్ పథకం కింద మంజూరు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్ లేబర్ రూమ్లలో ఏర్పాటుచేసిన వైద్య పరికరాలను ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణమోహన్, జనరల్ ఆసుపత్రి నిజామాబాద్ సూపరింటెంటెట్ డాక్టర్ ఎల్ రాములు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ పరికరాలు డాక్టర్ శ్రీనివాస్ సూపరింటెండెంట్ గా పనిచేసిన కాలంలో డాక్టర్ జలగం తిరుపతిరావు పర్యవేక్షణలో మంజూరైనందున వారిద్దరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 3 వెంటిలేటర్లు ,బబుల్ సిపాప్ పరికరాలు, సి ఆర్ యంత్రం, సి ఆర్ క్యాసెట్లు, సిరంజి పంపులు, ప్రసవ పట్టికలు, కార్డుయేటు కూగ్రఫీ యంత్రాలు అందజేశారు. ఈ వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో శస్త్ర చికిత్సలు, ప్రసూతి సేవలు, నవజాత శిశువుల సంరక్షణ ఇతర అత్యవసర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు వీలవుతుందని, ఆసుపత్రిలో వైద్య మౌలిక సదుపాయాలు బలోపేతం కావడంతో పాటు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ పరికరాలు కీలకపాత్ర పోషించనున్నాయని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అభివృద్ధికి సిఎస్ఆర్ నిధుల ద్వారా సహకారం అందించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ కు ఆసుపత్రి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.
ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కిరణ్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్స్ ,డాక్టర్ శ్రీకాంత్ ప్రొఫెసర్ పీడియాట్రిక్స్ ,డాక్టర్ లక్ష్మీప్రసన్న ప్రొఫెసర్ ప్రసూతి స్త్రీ రోగ విభాగం, డాక్టర్ సునీల్ ప్రొఫెసర్ ఈఎన్టి డాక్టర్, అరుణ రేఖ ప్రొఫెసర్ ప్రసూతి విభాగం, డాక్టర్ రవి నాగ ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ రమణ మోహన్, ప్రొఫెసర్ డెర్మటాలజీ, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రొఫెసర్ తో పాటు ఎస్ చంద్రకళ నర్సింగ్ సూపర్డెంట్ మరియు నర్సింగ్ అధికారులు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మశాలి బిడ్డకు అవకాశమివ్వండి

- ఎమ్మెల్సీ అభ్యర్థి జ్యోతి కిరణ్



సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 15 (జనంసాక్షి) : ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే నేత బిడ్డగా ఇక్కడి నేత కార్మికుల సమస్యలను తీర్చుతానని ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్న గుడ్ల జ్యోతి కిరణ్ స్పష్టం చేశారు. సిరిసిల్లలోని టౌన్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత 40 దశాబ్దాలుగా న్యాయవాది వృత్తిలో ఉండి తన వద్దకు సిరిసిల్లలో ఉన్నటువంటి నేత కార్మికులు వస్తే తమ వంతు సహాయాన్ని అందించినట్లు తెలిపారు. సిరిసిల్ల జిల్లా నేతన్న బిడ్డగా ఇక్కడి ఇక్కడి సమస్యలు పూర్తిగా తెలుసని, సమస్యల్ని పరిష్కరించడానికి ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. నేను ఎక్కడ ఉన్నా నా మూలాల్ని మరిచిపోనని తెలిపారు. న్యాయవాది వృత్తి చేసుకుంటూనే ఉద్యమాల్లో పాల్గొన్నానని, సోషల్ వర్కర్ గా కూడా పనిచేసి ప్రజాసేవకు అంకితమయ్యానన్నారు. సిరిసిల్ల పద్మశాలి బిడ్డగా పని చేస్తానని ,తనకు కుటుంబ సమస్యలు గానీ, ఎలాంటి బంధనాలు లేవని, ప్రజా సమస్యలు తీర్చడానికే ఎమ్మెల్సీ పదవికి అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాష్, వైద్య శివ ప్రసాద్, మ్యాన రాంప్రసాద్, పత్తిపాక లక్ష్మీరాజం, యెల్లె లక్ష్మీనారాయణ, గుడ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ విప్‌ను కలిసిన జ్యోతి కిరణ్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 15 (జనంసాక్షి) : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉండేందుకు జ్యోతి కిరణ్ తన వంతు ప్రయత్నాలు చేస్తుంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసును ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.జ్యోతి కిరణ్ కు సంబంధించిన పూర్తి ప్రొఫైల్ ను విప్ కు అందజేశారు. ప్రొఫైల్ ను పరిశీలించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాను అని చెప్పినట్లు సమాచారం.

# రూ. 400ల కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

- రెండు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్
- రెవెన్యూ అధికారుల వినతి మేరకు హైడ్రా చర్యలు




హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్లోని ఖనమేట్ గ్రామంలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఆక్రమణదారుల చేతిలో ఉన్న రూ. 400 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గురువారం కాపాడింది. 2 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. ఈ భూమిని కబ్జా చేసిన వాళ్లకు కోర్టులో కూడా చుక్కెదురైంది. ఈ భూమిని కాపాడడానికి రెవెన్యూ అధికారులు ప్రయత్నించినప్పుడు ప్రతిఘటన ఎదురయ్యింది. అక్కడ ప్రహరీ నిర్మించి ఆక్రమించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అయినా ఎప్పటికప్పుడు ఆక్రమించడానికి ఒకరితో ఒకరు పోటీపడ్డారు. తాజాగా 2 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ ఆక్రమణ దారులు బ్లూ షీట్స్ ఫెన్సింగ్ వేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు గురువారం రంగంలోకి దిగి ఆక్రమణదారులు వేసిన బ్లషీట్లను తొలగించారు. రెండు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు.

# ఖానాపూర్ అడవిలో టేకు చెట్ల నరికివేత!

- వందలాది వృక్షాలు నేలకూలుతున్నాయనే ఆరోపణలు
- అటవీశాఖ అధికారుల తీరుపై అనుమానాలు
- కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?



నిర్మల్ బ్యూరో , అక్టోబర్ 15 (జనంసాక్షి): అడవిని కాపాడాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులది. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఒకవైపు మొక్కలు నాటుతుంటే.. మరోవైపు ఏపుగా పెరిగిన విలువైన వృక్షాలు నేలకూలుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ అటవీ డివిజన్ పరిధిలో టేకు తదితర విలువైన చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కవ్వాల్ అటవీ ప్రాంతంలో భాగంగా ఉన్న ఖానాపూర్ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతాలు విలువైన వృక్ష సంపదకు నిలయంగా ఉన్నాయి. అయితే ఖానాపూర్ మండలంలోని సతన్‌పల్లి అటవీ ప్రాంతంతోపాటు సారంగాపూర్ సమీపంలోని అడవుల్లో పెద్దఎత్తున చెట్లను నరికివేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏర్వచింతల్ గ్రామ పరిధిలోనూ టేకు చెట్ల నరికివేతకు సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. గ్రామాలకు సమీపంలోనే ఈ పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అటవీ ప్రాంతాల్లో కొందరు అక్రమార్కులు యంత్రాల సాయంతో టేకు, తుమ్మ, వేప తదితర చెట్లను నరికివేసి, దుంగలుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అటవీ భూముల ఆక్రమణలు జరుగుతున్నాయనే విమర్శలూ ఉన్నాయి. అటవీ సంపదను అక్రమంగా తరలిస్తున్న వారిపై నిఘా పెట్టాల్సిన అధికారులు సమర్థంగా వ్యవహరించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చెట్ల నరికివేత, కలప రవాణాకు సంబంధించిన ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

ఇటీవల ఖానాపూర్ అటవీశాఖ సెక్షన్ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన నేపథ్యంలో అటవీశాఖలోని కొందరు అధికారుల పనితీరుపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామం నేపథ్యంలో అటవీ సంపద పరిరక్షణలో అధికారుల బాధ్యత, పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారితో కొందరు సిబ్బంది కుమ్మక్కయ్యారనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది.

ఖానాపూర్ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించి, చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణా, అటవీ భూముల ఆక్రమణలపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మిగిలిన అటవీ సంపదను కాపాడేందుకు పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మరి ఖానాపూర్ అటవీ ప్రాంతంలో జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై అటవీశాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం

- దసరా నుంచి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభం
- రాష్ట్ర రెవెన్యూ, వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీనివాసరెడ్డి
- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు..





వరంగల్ బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) : వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం ఆసుపత్రి నిర్మాణ పనులను రాష్ట్ర రెవెన్యూ, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ గైర్హాజరు అయ్యారు.

## దసరా నుంచి ఓపీ సేవలు ప్రారంభం

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన నూతన ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి తుది దశకు తీసుకొచ్చామని తెలిపారు. దసరా సందర్భంగా ఈనెల 20న నూతన ఆసుపత్రిలో ఓపీ సేవలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

## నిమ్స్ తరహాలో వైద్య సేవలు

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. నూతన ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభమైతే రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, నిమ్స్‌లో ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయో అదే తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనూ సేవలు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.ఉత్తర తెలంగాణ ప్రజలు మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గించి, వరంగల్‌లోనే ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ డిసిసి అధ్యక్షులు ఆయూబ్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరువును ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

- ఏజెన్సీలో 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలి
- రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్‌కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం అందేలా లక్ష్యం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క



హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశువులకు పశుగ్రాసం కొరత వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఆదివాసి గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. బేగంపేటలోని హోటల్లో గురువారం వీబీజీ రాం జీ ద్వారా ఎల్‌నినో కరువు నివారణ చర్యలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అదనపు డీఆర్డీఓలు, పీఓలు, ఎంపీడీఓలు ఈ సదస్సులో పాల్గొన్నారు. గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధే గ్రామ అభివృద్ధి అని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి జీవనోపాధి, కనీస మౌలిక సదుపాయాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. 'చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి" అని మంత్రి స్పష్టం చేశారు. మారుమూల గిరిజన గ్రామాలు కూడా ఇతర గ్రామాలతో సమానంగా అభివృద్ధి చెందేలా అధికారులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. గతంలో ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తితో, ప్రస్తుతం కూడా ఐటీడీఏలు, పంచాయతీరాజ్ శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాలు సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికి పైగా లోటుతో ఉన్నాయని సదస్సులోని నివేదిక పేర్కొంది. 18 జిల్లాల పరిధిలోని 320 మండలాలల్లో తీవ్ర ఎల్నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిందని వివరించింది. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సాధారణంగా వేసవి ప్రభావం మూడు నెలలకే పరిమితమవుతుందని, అయితే ఈసారి దాదాపు ఎనిమిది నెలలపాటు వేసవి తరహా పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావచ్చని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, పశుగ్రాసం అభివృద్ధి వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

# 379 కోట్ల సీఎస్ఎస్ గ్రాంటు

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పెరిగిన ఎంబీబీఎస్, పీజీ సీట్లకు అనుగుణంగా ఆయా కాలేజీలు, అనుబంధ హాస్పిటళ్లను అభివృద్ధి చేసేందుకు సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్(సీఎస్ఎస్) కింద 379 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు అనుమతులు తెలుపుతూ, కేంద్ర ఆరోగ్యశాఖ గురువారం రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శికి గురువారం లేఖ రాసింది. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 465 పీజీ సీట్లు పెరిగాయి. సీఎస్ఎస్ స్కీమ్ కింద ఒక్కో పీజీ సీటుకు సగటున 81.57 లక్షల చొప్పున, 379.29 కోట్ల రూపాయలను కేంద్రం ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వం మరో 253 కోట్ల రూపాయలను కలిపి.. మొత్తం 632 కోట్ల రూపాయలతో కాలేజీలు, హాస్పిటళ్లను అభివృద్ధి చేయనుంది. ఈ ఏడాది ఆదిలాబాద్ రిమ్స్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్ధిపేట గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు కూడా పెరిగాయి. 4 కాలేజీల్లో కలిపి 110 సీట్లు పెంపునకు ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చింది. ఈ కాలేజీలు, వాటి అనుబంధ హాస్పిటల్స్‌లో సౌకర్యాలు మెరుగు పర్చేందుకు 108 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టనుండగా, ఇందులో 64 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుంది.

# విజయ డెయిరీ పాలధరలు పెంపు..

- లీటరుపై రూపాయి భారం

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో విజయ డెయిరీ పాలు వినియోగదారులకు ధరల మోత మోగనుంది. విజయ డెయిరీ పాలకు సంబంధించిన విక్రయ ధరలను(ఎంఆర్పీ) సవరిస్తూ ది తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్' (టీజీడీడీసీఎఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త ధరలు అక్టోబర్ 17 నుంచి అమల్లోకి రానున్నాయి. పెరిగిన ధరల వివరాల ప్రకారం 500 మి.లీప్యాకెట్ ధర రూ.34 నుండి 35 కు చేరింది. హోల్ మిల్క్ ప్రస్తుత ధర రూ.39 ఉండగా, సవరించిన ధర రూ.40 కు పెరిగింది. వినియోగదారులు, మిల్క్ వెండర్స్, డిస్ట్రిబ్యూటర్లు, విద్యా, వ్యాపార సంస్థలు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు తెలిపారు. మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 040-27019851-54 లేదా ఈ-మెయిల్ lms.tgddcf@gmail.com ద్వారా సంప్రదించవచ్చని సూచించారు.

# కేటీఆర్ ఆరోపణలు అవాస్తవం

- 9 గనుల నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి
- ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



గోదావరిఖని (జనంసాక్షి) : సింగరేణిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ప్రస్తుతం తొమ్మిది గనుల నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతోందని, పదేళ్లలో ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏటా సగటున సుమారు 4 మిలియన్ టన్నుల జీ-9 బొగ్గు సరఫరా అయిందని, ఈ ఏడాది ఇప్పటివరకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సింగరేణి 25 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు సరఫరా చేసిందని, అందులో జీ-9 గ్రేడ్ బొగ్గు 1.20 మిలియన్ టన్నులు (12 లక్షల టన్నులు) మాత్రమే. దానిలోనూ 0.52 మిలియన్ టన్నులు తెలంగాణ జెన్కో విద్యుత్ కేంద్రాలకే సరఫరా అయిందని తెలిపారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఏటా 14 మిలియన్ టన్నుల జీ-9 బొగ్గు సరఫరా చేసేలా ఇంధన సరఫరా ఒప్పందం మీ హయాంలో జరిగిందే. సింగరేణి భవిష్యత్తులో చేపట్టే కొత్త గనుల నుంచి పెరిగే ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకొని ఆ ఒప్పందం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడంతో కీలకమైన కోయగూడెం-3, సత్తుపల్లి-3 బ్లాకులు సంస్థకు దక్కలేదు. ఫలితంగా ఏటా దాదాపు 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశాన్ని సింగరేణి కోల్పోయింది. దాదాపు 14 గనులు మూతపడటం కూడా ఉత్పత్తిపై గణనీయమైన ప్రభావం చూపింది. దీనివల్ల 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సింగరేణి కోల్పోయింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామని, మీ హయాంలో నైనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని, 2013లో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తాడిచెర్ల బ్లాక్-2కు మైనింగ్ అనుమతులు తెచ్చామని, వేలం ద్వారా మణుగూరు పీకే ఓసీ-2 డిప్పైడ్ బ్లాకును సింగరేణికి దక్కించామని, వీటితో రానున్న రోజుల్లో సింగరేణి ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. 137 ఏళ్ల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, లోడింగ్ నుంచి రవాణా, తూకం, తుది పంపిణీ వరకు ప్రతి దశను పర్యవేక్షించే సాంకేతికత ఆధారిత, బహుళ అంచెల వ్యవస్థ అమల్లో ఉందని, యాప్ సాప్/ఈ ఆర్ పి అనుసంధానం, జిపిఎస్/జిపిఆర్ఎస్ ద్వారా వాహనాల ట్రాకింగ్, జియో-ఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ తూకం, ఆకస్మిక తనిఖీలు, బూమ్ బారియర్లు, బొగ్గు నిల్వల క్రమానుగత పరిశీలన, బొగ్గు చోరీ నిరోధక (యాక్ట్) బృందాలు, నిరంతర నివారణాత్మక విజిలెన్స్ చర్యలు... ఇన్ని అంచెల నిఘా ఉందని, ప్రతి టన్నుకూ లెక్క ఉన్న ఈ వ్యవస్థలో బొగ్గు మాయమయ్యే అవకాశమే లేదని తెలిపారు. ఆధారాలు ఉంటే బయటపెట్టండి. లేకుంటే సింగరేణి కార్మికుల, అధికారుల నిజాయితీపై బురద చల్లడం మానుకోవాలని, సైట్ విజిట్ సర్టిఫికెట్ను సింగరేణి సంస్థ ప్రయోజనం కోసం మాత్రమే ప్రవేశపెట్టాలని, ఇది ఏ ఒక్కరి ప్రయోజనం కోసం ఉద్దేశించింది కాదని తెలిపారు. గతంలో ఓవర్ బర్డెన్ తొలగింపు టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లు అక్కడి భౌగోళిక పరిస్థితి, స్థానిక సాంఘిక అంశాలు, మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించకుండానే టెండర్లు వేసేవారు. టెండర్ దక్కి పని మొదలుపెట్టిన తర్వాత పరిస్థితులకు ఇమడలేక పనులు ఆపేయడం, మధ్యలోనే వదిలేసి వెళ్లారని, నష్టపోయింది సింగరేణే. అందుకే ఈ నిబంధన ఆరోగ్యకరమైన పోటీకి, సమర్థంగా పనిచేయగలిగే వారికి అవకాశం కల్పించేదేనని, ఇది సింగరేణికే ప్రత్యేకం కాదు. జీఎండీసీ-గుజరాత్, జీఐపీసీఎల్, ఎన్ఎండీసీ, కొన్ని సోలార్ ప్రాజెక్టులు, ఈపీసీ కాంట్రాక్టుల్లోనూ దీన్ని అమలు చేస్తున్నారని, సింగరేణిలోనూ ఇది కొత్త కాదు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన సీఎంపీడీఐ సలహా మేరకు 2018, 2021, 2023లో సి.హెచ్.పి.ల నిర్మాణం కోసం పిలిచిన టెండర్లలోనూ సైట్ విజిట్ ను పొందుపరిచారని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని గనులను సాధించేందుకు కృషి చేస్తామని, బొగ్గు ఉత్పత్తితో పాటు కీలక ఖనిజాలు, థర్మల్, సౌర విద్యుత్ రంగాల్లో సింగరేణి విస్తరించేలా కార్యాచరణ చేపడుతున్నామని, అక్రమాలు జరిగాయని మాట్లాడే కేటీఆర్, ఆ పార్టీ నాయకుల వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని, ఊహాజనిత ఆరోపణలతో రాజకీయం చేయడం తగదని హెచ్చరించారు. పదేళ్ల మీ కుటుంబ పాలనలో జరగని అవినీతి ఉందా..? కాళేశ్వరం నుంచి మిషన్ భగీరథ వరకు రూ. లక్ష కోట్ల కుంభకోణాలకు పాల్పడిన మీ నోటి వెంట 'అవినీతి' అనే మాట రావడం చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. సమావేశంలో నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్పు వేముల వీరేశం. రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ మక్కన్ సింగ్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370